తెలుగు



WWW.MAHAADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం జిల్లా వార్తలు

బుధవారం, హైదరాబాద్, 10-09-2025




# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- రాబోయే మూడు సంవత్సరాల్లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ






**కూసుమంచి, మహా:** "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టమైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే ఉన్నాం. పేదలకు అండగా నిలవడం మా ప్రభుత్వ ధ్యేయం. రాబోయే మూడు సంవత్సరాల్లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాయకన్‌గూడెం గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో రూ. 1.33 కోట్లతో కిష్టాపురం - నర్సింహులగూడెం పీఆర్ రోడ్డుకు, కిష్టాపురం గ్రామంలో రూ. 1.61 కోట్లతో కిష్టాపురం - పోచారం పీఆర్ రోడ్డుకు, రూ. 2.40 కోట్లతో కిష్టాపురం - ముత్యాలగూడెం పీఆర్ రోడ్డుకు శంకుస్థాపనలు చేశారు. జుజ్జులరావు పేటలో రూ. 88 లక్షలతో జుజ్జులరావు పేట ఆర్ అండ్ బి రోడ్డును మల్లాయి గూడెం పీఆర్ రోడ్డుతో కలిపే బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూసుమంచి జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. కూసుమంచి తహసిల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌ను ప్రారంభించారు. "ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఒక టన్ను గోదావరి ఇసుకను రూ. 1100కు, ఇతర అవసరాలకు టన్ను రూ. 1300కు అందుబాటులో ఉంచాం" అని మంత్రి తెలిపారు. అనంతరం కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేలకొండపల్లి మండలానికి చెందిన 42, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 82 మొత్తం 124 మందికి కాటమయ్య రక్షక కిట్లు పంపిణీ చేశారు. కూసుమంచి మండలానికి చెందిన 18 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 20 మంది క్రైస్తవ మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... "గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల 15 వేల కోట్ల రూపాయల అప్పు చేసి పేదలపై భారాలు మోపింది. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని వదిలేసింది. కానీ వేల కోట్లు దండుకోవచ్చని కాళేశ్వరం ప్రాజెక్టును అతి తక్కువ ఖర్చుతో కట్టారు. ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం మాత్రం భిన్నంగా పేదల కోసం నిజాయితీగా పనిచేస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం" అని గుర్తు చేశారు. "ఇల్లు అవసరమైన ప్రతి అర్హుడి కల నెరవేర్చే వరకు ప్రభుత్వం వెనుకడుగు వేయదని పొంగులేటి భరోసా ఇచ్చారు."

## పాలేరు చిన్నారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఉచిత షూస్ పంపిణీ

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు సేవా కార్యక్రమానికి శ్రీకారం**

**కూసుమంచి మండలంలోని 62 పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ**



**కూసుమంచి, మహా :** పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు ఉచితంగా షూస్ పంపిణీ కార్యక్రమానికి తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. మంగళవారం కూసుమంచి మండలం నరసింహులగూడెంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వయంగా 1 నుంచి 5వ తరగతి చదువుతున్న బాలబాలికలకు షూస్ అందజేశారు. మిగిలిన ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ నిర్వహించారు. కూసుమంచి మండలంలోని 62 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1700 జతల షూస్ పంపిణీ చేశారు. కొత్త షూస్ అందుకున్న చిన్నారులు ఆనందంతో కళకళలాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ... " మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎల్లప్పుడూ పేదల అంటే మక్కువ చూపే నాయకుడు. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ ట్రస్ట్ తీసుకుంటున్న ఈ తరహా చర్యలు చిన్నారుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయి. ఒక చిన్న అవసరాన్ని తీర్చడం ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచడం మంత్రి ప్రత్యేకత". తల్లిదండ్రులకు వ్యయ భారాన్ని తగ్గించడంలో, చిన్నారులకు సౌకర్యం కల్పించడంలో పెద్ద సహాయం. ఇలాంటి సేవా చర్యలు మరిన్ని జరగాలని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై చర్యలు



**మణుగూరు, మహా :** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శ్రీరంగాపురం, శాంతినగర్ గ్రామాల్లో మంగళవారం రెండవ విడత దోమల మందు పిచికారీ నిర్వహించారు. వర్షపు నీరు నిల్వలలో లార్వా ఉన్నట్లు గుర్తించి యాంటి లార్వా ఆపరేషన్ (తెమో ఫోస్) మందులు చల్లారు. దీంతోపాటు నీటి తొట్లలో నిల్వ నీటిని తొలగించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించి నీటి మడుగులు లేకుండా చూడాలని ఆయా గ్రామస్తులకు వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఎంటిఎస్ లు అరుణ్‌బాబు, రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ప్రమీల, వాణిశ్రీ పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలు



**బోనకల్లు, మహా (సెప్టెంబర్ 9) :** ఇంచార్జ్ ప్రిన్సిపల్ జోనాతాన్ బాబు అధ్యక్షతన ఘనంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలతో సత్కరించడం జరిగింది. ఎన్ ఎస్ ఎస్ పి ఓ మరియు చరిత్ర అధ్యాపకులు అంతోటి తిరుపతిరావు కాళోజీ నారాయణ గారి గురించి 1914 సెప్టెంబర్ 9 తేదీన కర్ణాటక రాష్ట్రంలో ని బీజాపూర్ జిల్లాలోని రట్టా హళ్లి గ్రామంలో తండ్రి రంగారావు , తల్లి రమాబాయమ్మ కు జన్మించినారు. తన విద్యాభ్యాసం వరంగల్ జిల్లాలో మడికొండలో ప్రాథమిక విద్య ను వరంగల్ , హైదరాబాద్ లో ఉన్నత విద్య పూర్తి చేసినారు. బహుభాషా వేత్త గా, తెలుగు, మరాఠా, కన్నడం,హిందీ మరియు ఉర్దూ భాష లలో కవిత్వం రాశారు. ఆర్య సమాజ ఉద్యమంలో, వందేమాత ఉద్యమంలో ,గ్రంథాలయ ఉద్యమంలో మరియు నిజాముకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమం లో 1939 -1943 సంవత్సరంలో జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది ఎ.రాజేంద్ర కుమార్,పి. లక్ష్మీకాంతం, యు.రామ కృష్ణ , యం.రమేష్ , యస్.రాజేంద్ర, జీ.ప్రియ కుమార్ రెడ్డి, ఏ యూఎం కృష్ణ,లైబ్రరీ యన్ ఎ.మోహన్ , యు డి సీ మదర్, జస్వంత్ బుజ్జమ్మ ,అరుణ, యశోద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ విద్యా చందనకు అదనపు బాధ్యతలు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (మహా) :** జిల్లా విద్యా అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లా విద్యా విభాగానికి సంబంధించిన పరిపాలనా, పర్యవేక్షణా కార్యక్రమాలు, పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల, ఉపాధ్యాయుల పర్యవేక్షణ వంటి అంశాలను ఆమె సమన్వయం చేయనున్నారు.

## అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్



**జూలూరుపాడు, సెప్టెంబర్ 09 (మహా) :** మండల పరిధి చింతల తండా గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్య రాములు తన అనుచరులతో కలిసి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు మాజీ సర్పంచ్ రాములు తెలిపారు. రాబోయే రోజుల్లో చింతల తండా గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వారికి తెలిపారు. కార్యక్రమంలో లేళ్ళ వెంకటరెడ్డి, మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదనరావు, లచ్చు నాయక్, లాలూ నాయక్, వేల్పుల నరసింహారావు, దుద్దుకూరి సుమంత్, నవీన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల అభివృద్ధే లక్ష్యం : మంత్రి పొంగులేటి



**కూసుమంచి, మహా :** పాలేరు నియోజకవర్గంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో రూ. 20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో కిష్టాపురం నుండి నర్సింహులగూడెం వరకు రూ. 1.33 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పీఆర్ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. కిష్టాపురం గ్రామంలో కిష్టాపురం నుండి పోచారం వరకు రూ. 1.61 కోట్ల రూపాయలతో చేపట్టనున్న పీఆర్ రోడ్డు మరమ్మతులకు, కిష్టాపురం నుంచి ముత్యాలగూడెం వరకు రూ. 2.40కోట్ల రూపాయలతో చేపట్టనున్న పీఆర్ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. జుజ్జులరావు పేట గ్రామంలో రూ. 88లక్షలతో జుజ్జులరావు పేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి మల్లాయిగూడెం పిఆర్ రోడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కూసుమంచి జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కూసుమంచి తహసిల్దార్ కార్యాలయంలో శాండ్ బజార్ ను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక అందించాలని సదుద్దేశంతో ఒక టన్ను గోదావరి ఇసుకను రూ. 1100కే అందించనున్నట్లు పొంగులేటి తెలిపారు. ఇతర అవసరాలకు టన్ను ఇసుక రూ.1300కి విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నేలకొండపల్లి మండలంలో 42, ఖమ్మం రూరల్ మండలంలో 82 మొత్తం 124మంది లబ్ధిదారులకు కాటమయ్య రక్ష కిట్లు పంపిణీ, కూసుమంచి మండలానికి చెందిన 18మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ, పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 20మంది క్రైస్తవ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాగా ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం గత ప్రభుత్వం ఎనిమిది లక్షల పందొమ్మిది వేల కోట్ల అప్పు చేసింది.. పేదవారికి కష్టం కలగకుండా ఈ ప్రభుత్వం ఆదుకుంటుంది రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చాము.. పేదలకు ఇళ్ళు కడితే కమీషన్ రాదనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ళు కట్టియ్యలేదు.. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే లక్షల కోట్లు దండుకోవచ్చని ఆనాటి ప్రబుద్ధులు ఆలోచన చేశారు. గత ప్రభుత్వానికి భిన్నంగాఇందిరమ్మ ప్రభుత్వం లో పేదల కోసం మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం... రాబోయే మూడు సంవత్సరాల్లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తాం.

## ఊరగుట్ట నేచర్ పార్క్‌ను.. పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి

**: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (మహా) :** ఊరగుట్ట నేచర్ పార్క్ ను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇల్లందు మండలం సుభాష్ నగర్ లోని ఊర గుట్ట నేచర్ పార్క్‌ను సందర్శించి, అక్కడ పర్యాటకులను ఆకర్షించడానికి, నేచర్ పార్క్ అభివృద్ధి కి అవకాశాలు, భవిష్యత్తులో చేపట్టవలసిన కార్యక్రమాలను సంభంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఊరగుట్ట నేచర్ పార్క్ జిల్లాలో సహజసిద్ధమైన అద్భుత సౌందర్యాన్ని కలిగిన ప్రదేశమని, దీనిని సక్రమంగా అభివృద్ధి పరచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని పేర్కొన్నారు. పార్క్ అభివృద్ధి ద్వారా పర్యాటక రంగంలో పురోగతితో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయాన్నారు. ఊరగుట్ట నేచర్ పార్క్ లో ట్రెక్కింగ్ మార్గాలు, జిప్ లైన్, ప్లే ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి వినోదాత్మక వసతులు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువత, కుటుంబాలు, విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులయ్యేలా వినోదం, భద్రత, విశ్రాంతి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్క్ లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక వసతులు తప్పనిసరిగా కల్పించబడాలని తెలిపారు. పార్క్ లో ఏర్పాటయ్యే స్టాల్స్, ఫుడ్ కార్నర్స్, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు వంటి వాటిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థికాభివృద్ధి కలుగుతుందని, స్థానిక మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఊరగుట్ట నేచర్ పార్క్ ను జిల్లాలో పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడం లక్ష్యమని, దీనిద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి కొత్త దారులు తెరవబడతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ రవి, ఎఫ్ డి ఓ కరుణాకర చారి, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, ఏం పి డి ఓ ధన్సిగ్ మరియు సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి




**సత్తుపల్లి, మహా (సెప్టెంబర్9) :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ పామాయిల్ కార్మికులు సత్తుపల్లి మండల స్థాయి జనరల్ బాడీ సమావేశం ఆదివారం సిద్ధారం గ్రామంలో రేగుల కొర్రాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతంలో పామాయిల్ పంట విస్తారంగా పండుతుంది అన్నారు. ఈ పంట పండించే రైతులకు, ఫ్యాక్టరీ యాజమాన్యాలకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. పామాయిల్ తోటలో పనిచేసే కార్మికులకు మాత్రం నేటికీ గుర్తింపు రాలేదన్నారు. పాలకులు మారిన పామాయిల్ కార్మికుల బ్రతుకులు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఈ దేశానికి రైతు వెన్నుముక అన్నమాట ఎంత వాస్తవమో రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కావాలి అని అడగటం ఎంత న్యాయమో పామాయిల్ తోటలో పనిచేసే కార్మికులకు గుర్తింపు కావాలని అడగటంలో తప్పు లేదన్నారు. గెలలు నరికే కార్మికులు పామాయిల్ చెట్లు ఎక్కే సమయంలో పాములు,జెర్రీలు తేళ్ల కాటుకు అనారోగ్యం పాలవుతున్నారు. మరో ప్రక్క మట్టలు, గెలలకు ఉండే పొదునైన ముళ్ళు కాళ్లు, చేతులు, ఒంటిమీద పడి సెప్టిక్‌కైయి పనికి దూరంగా ఇంటికే పరిమితం అవుతున్నారని అన్నారు. పామ్ ఆయిల్ గెలలు నరికే కార్మికుల సమస్యలను ఫ్యాక్టరీ యాజమాన్యం, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించని ఎడల పామాయిల్ కార్మికులు ఐక్య పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, కార్యదర్శి రేగుల కుర్రాజులు, ఉపాధ్యక్షుడు వాసం కిషోర్, సహాయ కార్యదర్శి తడికమళ్ళ అర్జున్, కోశాధికారి తోటకూర రాజు వీరితోపాటు ఆరుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ యలగం కృష్ణ, వ్యవసాయ కార్మికసంఘం డివిజన్ కమిటీ సభ్యులు ఎలగం రాములు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల పోటీలో సిపిఐ

**ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలి**

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బానుప్రసాద్**





**నేలకొండపల్లి, సెప్టెంబర్ 9 మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్ట్ పార్టీ పోటీలో ఉంటుంది అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బాను ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ మండల కౌన్సిల్ మరియు ముఖ్య కార్యకర్తల సమావేశం ను కర్నాటి కృష్ణయ్య భవనం నందు కామ్రేడ్ బాగం నరసింహారావు అధ్యక్షులు గా నిర్వహించారు. ఈ సందర్భంగా అయినా మాట్లాడారు..... కార్మిక, కర్షక, కష్టజీవుల పక్షాన ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ అనగారిన వర్గాల పక్షాన పోరాడేది ఎర్రజెండా అని అన్నారు. అధికారంలో ఉన్న లేకున్నా నిరంతరం ప్రజల పక్షాన నిలబడేది కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులు తగు రీతిలో సమాయత్తం కావలని కోరారు. జిల్లా పార్టీ నిర్ణయం మేరకు పొత్తులు ఉంటాయని తెలిపారు. బీసీ రిజర్వేషన్ రాకుండా తమ రాజకీయ అవకాశవాదంతో కేంద్ర ప్రభుత్వం మోకలడ్డుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు శాసనసభలో బిల్లు ఆమోదించిన రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థలతో వాడుకుంటూ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుకుం టుందని తెలిపారు. .కాలేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై విచారణ జరిపిన పిసిగోష్ నివేదిక బిఆర్ఎస్ అవినీతిని చర్యలు తీసుకునే అవకాశం ఉన్న మరింత పారదర్శకత కోసం సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభు త్వం కోరడం స్వాగతించాల్సిన విష యం అని అన్నారు. రైతులు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని అభాసపాలు చేయాలని లాలూచీ రాజకీయాలను మానుకోవాలని. రాష్ట్రానికి సరిపడా యూరియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శులు మల్లెబోయిన ఉపేందర్, మాళ్లోతు అయోధ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల నాయకులు పాలపాటి ఆశోక్, చావా గణపతి, రాయల మాధవ్ రావు, పొలంపల్లి నారయణ, ఆలేటి మహేష్, కృష్ణ, బాలేబోయిన వేంకన్న, చేన్నబోయిన మల్లయ్య, తమ్మిశెట్టి మమతా తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన వైరా ఎమ్మెల్యే



**జూలూరుపాడు, సెప్టెంబర్ 09 (మహా) :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 65 మంది లబ్ధిదారులకు 65, లక్షల 7 వేల 540 రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు పని ముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇండ్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేస్తుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అందరూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో లేళ్ళ వెంకటరెడ్డి, మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదనరావు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ తులసీరామ్, ఏపీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ANN తెలుగు

WWW.MAHAADAILY.COM

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ । 10-09-2025

ఖమ్మం జిల్లా వార్తలు




# మోడల్ నియోజకవర్గంగా మధిర

- ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా మధిర
- ఎర్రుపాలెం మండలంలో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





**మధిర , మహా :** గ్రామీణ మౌలిక వసతులు అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోనీ ఎరుపాలెం మండలంలో పలు గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్లు, అంగన్వాడి భవన నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మధిర నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకునే దిశగా నియోజకవర్గంలో ప్రణాళికా ప్రకారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మధిరను తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. శాశ్వత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామానికి ఆధునిక మౌలిక వస్తువులను పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టుగానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల అవసరాలు, కోరికలను దృష్టిలో పెట్టుకొని వివిధ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఒక కొత్త దిశలో పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఎర్రుపాలెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో 45 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, పెద్ద గోపవరం గ్రామంలో 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, పెద్ద గోపవరం గ్రామం ఎస్సీ కాలనీలో 85 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బుచ్చిరెడ్డి పాలెం గ్రామం ఎస్సీ కాలనీలో 40 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, బనిగండ్లపాడు గ్రామం ఎస్సీ కాలనీలో కోటి 75 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, అయ్యవారిగూడెం ఎస్సీ కాలనీలో 55 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు, భీమవరం గ్రామంలో 12 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసారు.

**గ్రామ గ్రామాన ఘన స్వాగతం**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు, వందలకోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో భారీగా జనం తరలివచ్చారు. డబ్బు చప్పుళ్ళు, మంగళ హారతులతో డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో డిప్యూటీ సీఎం పై ప్రేమతో పూల వర్షం కురిపించారు.

**మధిర నియోజకవర్గం అభివృద్ధి పనుల పై డిప్యూటీ సీఎం సమీక్ష**

మంగళవారం మధ్యాహ్నం బనిగండ్లపాడు లో భోజన విరామం అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి రెవిన్యూ, ఫారెస్ట్, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, పర్యాటకశాఖ అధికారులతో విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వాటి పూర్తికి అధికారులు చేపట్టాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సి ఉన్న అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించారు.

## సింగరేణి పాఠశాలలో...

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు



**మణుగూరు, మహా :** తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను పివి కాలనీ సింగరేణి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల హెచ్.ఎం ఆర్ కళ్యాణి కాళోజి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు చిత్రపటం వద్ద పూలు సమర్పించి కాళోజిని స్మరించారు. ఈ సందర్భంగా హెచ్.ఎం కళ్యాణి మాట్లాడుతూ.. కాళోజి చిన్ననాటి నుంచే తెలంగాణ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ సమరంలో అనేక సార్లు జైలుశిక్ష అనుభవించిన మహనీయుడని, ప్రజాకవి, పోరాటయోధుడైన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ ఉపాధ్యాయులు ఎం వేణు మాట్లాడుతూ కాళోజి వారసత్వాన్ని కొనసాగించాలని సూచించారు. సైన్సు ఉపాధ్యాయులు దయానంద్ తెలంగాణ భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని, విద్యార్థులు తమ భాషపై గౌరవం పెంచుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు కోటేష్ కాళోజి చూపిన ధైర్యసాహసమే ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవానికి పునాది అని పేర్కొన్నారు. ఎన్సీసీ మాస్టర్ రాజసింహ విద్యార్థులు మహనీయుల చరిత్రను చదివి తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మస్తానయ్య, పి.టి. సాహిద్, సుశీల, స్రవంతి, లక్ష్మి, రజిత, కళ్యాణ్‌కుమార్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సింగరేణి ఇనుప సామాగ్రి పట్టివేత



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి పాత ఇనుప సామాగ్రి దొంగతనాలు పెరుగుతున్న తరుణంలో మణుగూరులో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. మణుగూరు టీడీపీ సెంటర్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ ఎదురు వీధిలోని ఓల్డ్ ఐరన్ షాపుపై సింగరేణి సెక్యూరిటీ అధికారులు మంగళవారం అకస్మాత్తుగా దాడులు నిర్వహించి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 500 కిలోల సింగరేణి ఐరన్ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో సింగరేణి సంస్థలో ఐరన్‌తో పాటు కాపర్ కేబుల్ చోరీలు ఎక్కువవుతున్నాయన్న ప్రచారం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లోనైనా ఎస్ అండ్ పి సి సెక్యూరిటీ విభాగం ప్రత్యేక దృష్టి సారించి దొంగతనాలను అరికట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే స్క్రాప్ దొంగతనాలతో పాటు కార్మికులు నివసించే కాలనీల్లోనూ చోరీలు పెరుగుతున్నాయని, అక్కడ భద్రతను మరింత బలోపేతం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు. సింగరేణి సెక్యూరిటీ విభాగం నుంచి నిరంతర పహారా, రాత్రి వేళల్లో భద్రతాపరంగా కఠిన చర్యలు తీసుకుంటే మాత్రమే ఇలాంటి దొంగతనాలు అరికట్టగలుగుతామని కార్మిక నేతలు అభిప్రాయపడ్డారు. తనిఖీల్లో సెక్యూరిటీ అధికారులు కట్టా శ్రీనివాసరావు, రాజనర్సు సిబ్బంది ఉన్నారు.

## కాళోజీ సేవలు మరవలేనివి



**నేలకొండపల్లి, సెప్టెంబర్ 9 మహా:** ప్రజా కవి కాళోజీ నారాయణరావు సేవలు మరవలేనివి అని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కాళోజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... కాళోజీ తన రచనలతో ఉద్యమానికి స్ఫూర్తి నింపినట్లు తెలిపారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఆయన సాహిత్యం ఎంతో పని చేసిందని అన్నారు. ఆయన పుట్టిన రోజు ను తెలంగాణ భాషా దినోత్సవం ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది'తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (మహా) :** విద్యానగర్ ప్రాథమిక పాఠశాలలో కాళోజి జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. తెలుగు పుస్తక పఠనంలో మాధవన్, నాలుగవ తరగతి పాటల పోటీలలో కీర్తి మూడవ తరగతి కథలు నితిన్ నాలుగవ తరగతి విద్యార్థులు గెలుపొందారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ కే నాజియా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత్రి ఎస్ సుమిత్రాదేవి అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు బి నరసింహారావు సమన్వయకర్తగా వ్యవహరించారు.

## తెలుగు సాహిత్యానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు చిరస్మరణీయం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (మహా) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనల మేరకు మంగళవారం కాళోజీ గారి 111వ జయంతి వేడుకలను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని,తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన ఆదర్శనీయుడు కాళోజీ నారాయణ రావు అని,తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన కవితలతో ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మాహనీయుడుగా అభివర్ణించారు. భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ తో సన్మానింపబడిన ప్రజాకవి కాళోజీ స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్స్ సీహెచ్.శ్రీనివాస్,ఇ.శ్రీనివాస్,ఆర్ఐలు లాల్ బాబు, సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు మరియు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా మునిసిపాలిటీ అభివృద్ధి కి చర్యలు

### ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చ



**ఖమ్మం రూరల్, (సెప్టెంబర్ 09), మహా :** ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ప్రాంతం, కొత్తగా ఏర్పడ్డ మునిసిపాలిటీ ఏదులాపురం అభివృద్ధి కి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ తెల్దారుపల్లి, మద్దులపల్లి లలో మంత్రి పర్యటించారు. మంత్రి పర్యటనలో తెల్దారుపల్లి ముత్యాలమ్మ గుడి నుండి ధోభీఘాట్ వరకు ఎన్ఎస్పీ కెనాల్ మీదుగా రూ. 1.54 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్ పనులకు శంఖుస్థాపన, మద్దులపల్లి ఆర్ అండ్ బి రోడ్ నుండి లుంబినివనం వరకు రూ. 69 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెల్దారుపల్లి ప్రాంతానికి ప్రజా ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లోనే రూ. 12.35 కోట్లు మంజూరు చేసినట్లు, వీటితో కొన్ని పనులు పూర్తి కాగా, కొన్ని శంఖుస్థాపన, కొన్ని టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా మద్దులపల్లి ప్రాంతానికి బీటీ రోడ్లు, అంతర్గత సిసి రోడ్లు నిర్మించుకున్నామన్నారు. రాబోయే కొద్ది రోజుల్లో ప్రతి ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేకపోయిన ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాల ద్వారా మహిళలకు భరోసా కల్పించామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిన రేషన్ కార్డు సమస్యలను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పరిష్కరించి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని అన్నారు. కొత్త రేషన్ కార్డులతో పాటు, రేషన్ కార్డుల్లో సభ్యుల చేర్పులు చేశామన్నారు. పేదలకు అండగా ఉండే మన ప్రభుత్వం మొదటి విడతగా రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని అన్నారు. నియోజకకగానికి 3500 ఇండ్లు మంజూరు చేసినట్లు, త్వరలో రెండో విడత ఇస్తామని అన్నారు. ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, విడతల వారిగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని మంత్రి అన్నారు. మంత్రి పర్యటన లో తెల్దారుపల్లి లో అర్హులైన 24 మందికి ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ చేశారు. మద్దులపల్లి లో 22 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజే శారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ బాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఆర్ అండ్ బి ఇఇ పవార్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం



**ఏన్కూర్, మహా :** ఏన్కూర్ మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9న గొప్ప కవి, స్వాతంత్ర సమరయోధుడు, ప్రజాకవి, పద్మ విభూషణ్ డాక్టర్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ కాళోజీ జన్మదినం తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకోవటం నిజంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గొప్ప వరమని కొనియాడారు. నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించిన వ్యక్తి కాళోజీ అని తెలంగాణలో అక్షర జ్యోతి వెలిగించాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్ ను స్థాపించారన్నారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారన్నారు. తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోపాధ్యాయులుగా పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు డిఎస్. నాగేశ్వరరావును ఉపాధ్యాయ దుఃశ్శాలువతో ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ అందరి గొడవనే నా గొడవగా భావించి ఎదిరించే తత్వాన్ని నేర్పిన గొప్ప మనసున్న వ్యక్తి కాళోజి నారాయణరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర విముక్తి కోసం పరితపించిన వ్యక్తి కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం ఉద్యమస్ఫూర్తిని నింపిందన్నారు. అన్యాయాన్ని ఎదిరించేవాడు నాకు నిజమైన ఆరాధ్యుడని, ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక అని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి కాళోజీ. ప్రజల గొడవే నా గొడవ, పుట్టుక నీది చావు నీది, బ్రతుకంతా దేశానిది. అన్నం రాశులు ఒకచోట, ఆకలి మంటలు ఇంకో చోట, అన్యాయాన్ని ఎదిరించే వాడే నాకు ఆరాధ్యుడు. సాగిపోవుటే బతుకు ఆగిపోవుటే చావు అని తన కలం నుండి చాలు వారిన కవిత్వాన్ని, తెలంగాణ మాండలికానికి నిలువెత్తు నిదర్శనం మన కాళోజీ. అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంటు సకలించు ఆంధ్రుడా! చావవెందుకురా అంటూ తెలుగువారిని కాళోజీ హెచ్చరించారన్నారు. ఆత్మాభిమానంతో కూడిన తన కవితా ప్రకటన ద్వారా అమ్మ భాషకు దూరమైతే అస్తిత్వానికి విలువ లేదని స్పష్టంగా చెప్పిన వ్యక్తి కాళోజీ అని వారి గొప్పతనాన్ని చాటారన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ బి.రవి, ఉపాధ్యాయులు కె.శ్యామల, బి.రవి, ఎం.చందర్ రావు, డి.వెంకటరమణ, వి.రమేష్, బి.సింగ్యా, జె.నాగేశ్వరరావు,డి.ఉషశ్రీ, టి.సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆది కర్మయోగి పథకం



**కారేపల్లి, మహా :** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి పథకం తీసుకవచ్చిందని సింగరేణి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కారేపల్లి హైస్కూల్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ గిరిజన సమాజం విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధిలో లోపాలను ఎదుర్కొంటున్నాయన్నారు. ఆ సమస్యలు రూపుమాపేందుకు లక్షలాది మంది శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా కృషి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో సేవలను మెరుగుపరచడం, గిరిజన సంస్కృతిని సంరక్షించడం, స్థానిక ప్రజల ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలన్నారు. దీనిలో ప్రతి ఒక్కరు స్వచ్ఛంధంగా భాగస్వాములు కావచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యం, ఏఎల్‌వో ఎల్.రాములు తదితరులు పాల్గొన్నారు.

## డైరక్టర్ (ఈ అండ్ ఎం) గా భాద్యతలు చేపట్టిన తిరుమల రావు



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9 (మహా) :** సింగరేణి జనరల్ మేనేజర్(ఈ ఎం) సిహెచ్‌పి గా పనిచేస్తూ సింగరేణి సంస్థ డైరెక్టర్(ఈ అండ్ ఎం) గా నియామకమైన పదివీ బాధ్యతలు చేపట్టిన ఎం.తిరుమలరావును కార్పొరేట్ జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ మరియు వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని డైరెక్టర్(ఈ అండ్ ఎం) ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(ఈ అండ్ ఎం) ఎస్.వి.రామ మూర్తి డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు, బి.శివ కేశవ రావు, డివై.పిఎం లు కే.శివ కుమార్, కే. సునీల్ కుమార్, డివై.ఎఫ్‌ఎం ఈ.రమేష్, అకౌంట్స్ ఆఫీసర్ జే.వి.ఎస్.రామారావు, డివై.ఎఫ్‌ఎం ఈ.రమేష్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, అకౌంట్స్ ఆఫీసర్ లు జే.వి.ఎస్.రామారావు, వి.పూజ, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు పాల్గొన్నారు.

## బీజేపీదే అప్రజాస్వామిక పాలన

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**ఖమ్మం, మహా :** ఓట్ల చోరీతో గద్దెనెక్కి హామీలు ఏమార్చి 11 ఏండ్ల నుండి దేశంలో బిజెపి అప్రజాస్వామిక పాలన సాగుతోందని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఖమ్మంలో కాంగ్రెస్ పాలనపై బీజేపీ చేసిన ధర్నాను ఖండిస్తూ సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బిజెపి మోడీ పరిపాలన ఎలా ఉందంటే వారు అధికారంల్లోకి వచ్చే ముందు కేంద్రంలో అనేక డోల్ల హామీలను ప్రకటించి దొడ్డి దారిన అధికారంలోకి వచ్చారు. బిజెపి అధికారం లోకి వచ్చి నేటి 11 సంవత్సరాలు దాటింది ఆనాడు బిజెపి అధికారం చేపట్టడానికి ఈ దేశంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నల్లధనన్ని వెలికి తీసి ప్రతి పేదవాడు అకౌంట్లో 15 లక్షలు జమ చేస్తానని, స్విస్ బ్యాంకులో మూలుగుతున్న నల్లధనాన్ని ఇండియాకు రప్పించి ఇండియా కష్టాలు తీరుస్తానని అన్నారు. అనేక బూటకపు మాటలు చెప్పి అధికారాన్ని చేపట్టారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కూడా ఏ ఒక్క హామీని నెరవేర్చపోగా రాజ్యాంగాన్ని నిర్వీర్యపరిచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి పాలనపై ప్రజలు ఇసుకుపోతే అది గమనించి నా మోదీ మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో దొంగ ఓట్లు సృష్టించుకుని కొంతమంది దొంగల్ని కలుపుకొని కేంద్రంలో అధికారాన్ని చేపట్టి రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు. మీరుకూడా కాంగ్రెస్ పాలనపై విమర్శించే స్థాయికి వచ్చారా ఇక్కడ ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలు ప్రకటించి ఈ రాష్ట్రాన్ని అగ్రగామిలో నిలిపి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు తీస్తున్న కాంగ్రెస్ పాలన మీకు నచ్చక పోవడానికి ప్రధాన కారణం మీలాగా కాంగ్రెస్ పార్టీ దోచుకు తినదని దోచుకునే అవలంబన కాంగ్రెస్ పార్టీకి లేదని ఈ సందర్భంగా తెలియజేస్తున్న సిగ్గుమాలిన వ్యవహారాలన్నీ మానుకొని జాగ్రత్తగా ఉంటే మంచిదని ఈ సందర్భంగా తెలియజేస్తున్న ఈ రాష్ట్రంలో ఈ దేశంలో రాహుల్ గాంధీ ఆలోచన విధానంతోనే ఈనాడు బీసీ డిక్లరేషన్ తీసుకువచ్చి బీసీలకు రాజకీయాలలో ఉద్యోగాలలో అవకాశాలు కల్పించడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంటే మీరు దాన్ని కాలయాపన చేసి బీసీ రిజర్వేషన్లు అమలుపరచకుండా అడ్డుపడుతున్నారు అడ్డుపడటమే కాకుండా అనేక అడ్డగోలు విమర్శలు చేస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త మీ మోదీ పరిపాలనలో ప్రజలు ఏ రకంగా అవస్థ చెందుతున్నారు మొన్న బీహార్ లో మీ వ్యవహార శైలినీ ప్రజలందరూ గమనిస్తున్నారు. మీలాగా గంగ ఓట్లతో మేము అధికారంలోకి రాలేదు అలాంటి పని మేము చెయ్యం మీరంతా దొంగలు కాబట్టి దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారని తెలియజేస్తున్నాను అది గమనించి మీరు ఈ రాష్ట్రంలో నడుచుకోవాలని లేని పక్షంలో ప్రజలు మీపై తిరగబడి మిమ్మల్ని ఎవర్ని కూడా బయట తిరగకుండా రాళ్లతో చెప్పులతో కొడతారని తెలియజేస్తున్నాను తస్మాత్ జాగ్రత్త.

## ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**చింతకాని, (సెప్టెంబర్ 09 మహా) :** మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లుల లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ ఏఈ సుప్రియ. అనంతరం వారు మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేయవలసిందిగా లబ్ధిదారులకు తెలియజేసి, పలు సూచనలు,సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో.... గ్రామ కార్యదర్శి చామర్తి కృష్ణమాచారి, మండల కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున, మధిర నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ వేర్పుల, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరువూరి వెంకటేశ్వర్లు, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యరమాల ప్రసాద్, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు ఎస్కే సైదా,కాంగ్రెస్ నాయకులు కాశీమాల లక్ష్మణ్, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు వితరణ



**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలం ఒడ్డుగూడెం ప్రాథమిక పాఠశాల టీఎస్‌యూటీఫ్ నాయకులు బానోత్ మంగీలాల్ చొరవతో అతని మిత్రులు విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాంగులు వితరణ చేశారు. మను, తృప్తేష్ షా, రామన్, జయసుధ, సంజయ్ పంచాల్ ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన బ్యాగులను ఎంఈవో దుగ్గిరాల జయరాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎం తేజావత్ శారధ చేతుల మీదిగా విద్యార్థులకు అందజేశారు. దాతలను ఎంఈవో జయరాజు అభినందించారు. ఈసందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈవో దుగ్గిరాల జయరాజును సన్మానించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు బానోత్ మంగీలాల్, హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

Follow: @ANNTELUGU

10-09-2025

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 277 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


టాప్ న్యూస్

## కవితను చేర్చుకోవడమంటే.. జగన్‌ను చేర్చుకోవడం



- నారా లోకేష్ సంచలన కామెంట్స్
- తెలంగాణపై ఫోకస్ చేస్తాం

02

## ప్రభుత్వానికి ఈకార్-రేస్ కేసు నివేదిక



- కేటీఆర్ పై ఏసీబీ ఛార్జ్ షీట్ వేసే అవకాశం
- ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కీలక పరిణామం

02

## నేపాల్ పరిస్థితి ఏ దేశంలోనైనా రావొచ్చు



- మోదీని ట్యాగ్ చేసి సంజయ్ రౌత్ ట్వీట్

02

# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్

- జస్టిస్ సుదర్శన్ పై గ్రాండ్ విక్టరీ..
- అభినందించిన ప్రధాని మోదీ
- ఎన్డీఏ సామర్థ్యం కంటే అధిక ఓట్లు
- 15 ఓట్లు క్రాస్

**ఢిల్లీ, మహా:** ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి తరపున పోటీ చేసిన సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై ఆయన 152 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే రాధాకృష్ణన్ విజయం సాధించడం విశేషం. సీపీ రాధాకృష్ణన్ కు 452 ఓట్లు రాగా, జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. 15 ఓట్లు లెక్కలోకి రాలేదు. కాగా పార్లమెంట్‌లో మొత్తం ఓటర్లు 781 మంది ఎంపీలు ఉండగా 767 ఓట్లు పోలయ్యాయి.

మిగతా 2లో







# తెలంగాణ రాజకీయాలపై కవిత ముద్ర

## కవిత.. బలమైన నాయకురాలే

- ఆమె రాజీనామా బీఆర్ఎస్ కు నష్టమే
- హరీష్, సంతోష్ లపై ఆరోపణల్లో నిజాలున్నాయ్
- వోటా సంచలన సర్వేలో జనాభిప్రాయం

**(హైదరాబాద్ - మహా)** తెలంగాణ రాజకీయాల్లో కవిత ముద్ర స్పష్టమని, కవిత బీఆర్ఎస్ నుండి బయటకు రావడం వల్ల తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారుతుందని వోటా సర్వేలో మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లో ర్యాండమ్ గా నిర్వహించిన సర్వేలో కవిత రాజకీయ భవిష్యత్తుపై ప్రధానంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కవిత రాజీనామా ఊహించిందేనని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ఈ సర్వే వివరాలను పబ్లిక్ డొమైన్ లో విడుదల చేశారు.

వివరాలు 3లో



## 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు మంజూరు చేయండి

- ఆర్ఆర్ఆర్ (నార్త్) పనుల ప్రారంభానికి అనుమతులివ్వండి
- మన్ననూర్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతించండి
- హైదరాబాద్‌మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయండి
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి వినతి
- సీఆర్ఐఎఫ్ పనులకు వారంలోపు అనుమతులు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ

03





# అల్లు వారి కక్కుర్తి

## సీఎం రేవంత్ షాక్

జూబ్లీహిల్స్‌లోని అల్లు బిజినెస్ పార్క్ లో అక్రమ నిర్మాణం

నిర్మాణాన్ని ఎందుకు కూల్చవద్దో చెప్పాలని జీహెచ్ఎంసీ నోటీసులు

**హైదరాబాద్, మహా :** ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ ఫ్యామిలీకి వరుస షాకులు తగులుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు అనూహ్యంగా నోటీసిచ్చారు. జూబ్లీహిల్స్ లోని అల్లు బిజినెస్ పార్క్ భవనంపై అక్రమ నిర్మాణం చేశారని, ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ బల్దియా నుంచి సర్కిల్ 18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇటీవలే అరవింద్ అమ్మ గారు కనక రత్నమ్మ , ఆపై ఆయన చిరకాల మిత్రుడు నాగరాజు మరణాలతో తీవ్ర శోకంలో ఉన్న ఆయనకు ఇప్పుడు జీహెచ్ఎంసీ నుంచి ఊహించని షాక్ తగిలింది. నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయనకు చెందిన వాణిజ్య భవనంపై అనుమతులు లేకుండా పెంట్‌హౌస్ నిర్మించడమే ఇందుకు కారణం. ఈ అక్రమ నిర్మాణాన్ని ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు ఆ నోటీసులో స్పష్టం చేశారు.

వివరాలు 2లో



02

## ప్రధాని నివాసానికి నిప్పు

### హింసాత్మకంగా నేపాల్.. పీఎం కేపీ శర్మ ఓలీ రాజీనామా

- సోషల్ మీడియా బ్యాన్‌పై ఆగని హింసాకాండ.. దేశవ్యాప్త నిరసనలు
- పార్లమెంట్ భవనం, మంత్రుల ఇండ్లు ధ్వంసం చేసిన ఆందోళనకారులు


SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,10,290 |
| 22 క్యారెట్ | 1,01,100 |
| సిల్వర్ (కేజీ) | 1,30,000 |


## గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు రద్దు

### జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను రద్దు చేస్తూ హైకోర్టు సంచలన తీర్పు

- రీవాల్యుయేషన్ చేయండి లేదా మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని ఆదేశం
- ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని టీజీపీఎస్సీకి సూచించిన హైకోర్టు
- హాల్ టికెట్ల జారీ, పరీక్ష ఫలితాల్లోనూ అనుమానాలు, కోర్టుకు వెళ్లిన అభ్యర్థులు
- గ్రూప్1కు ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి.. తుది నియామకాలు మాత్రమే పెండింగ్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో గ్రూప్ 1 ఫలితాల మీద హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాదాస్పదమైన గ్రూప్1 పరీక్షా అంశంపై తీర్పును ఇచ్చింది. మార్చి 10వ తేదీన ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను హైకోర్టు రద్దు చేసింది.

మిగతా 2లో




## సీఎం రేవంత్ నోరు విప్పితే
# గోబెల్ ప్రచారం

- కామన్ సెన్స్ లేకుండా మాట్లాడి మీ కుర్చీ గౌరవం తగ్గించకు
- మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తా అంటే నీళ్లు ఎక్కడివి?
- రూ. 7000 కోట్లతో ప్రారంభించబోతున్న పథకం కాళేశ్వరం నీళ్లతో కాదా..?
- మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే గోబెల్ ప్రచారమేనని, మొత్తం అబద్ధాలేనని మండిపడ్డారు. అసత్యాల ప్రచారంలో సీఎం రేవంత్ ఉన్నారని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్ మాట్లాడారు.

మిగతా 2లో




manepally
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890



Exclusive Designer Jewellery

General Bazar | Punjagutta | Kukatpally | Dilsukhnagar | Chandanagar | Suchitra Circle

www.manepally.com • online@manepally.com

# అల్లు వారి కక్కుర్తి




**హైదరాబాద్, మహా :** ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ ఫ్యామిలీకి వరుస షాకులు తగులుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) అధికారులు అనూహ్యంగా నోటీసిచ్చారు. జూబ్లీహిల్స్ లోని అల్లు బిజినెస్ పార్క్ భవనంపై అక్రమ నిర్మాణం చేశారని, ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ బల్దియా నుంచి సర్కిల్ 18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఇటీవలే అరవింద్ అమ్మగారు కనక రత్నమ్మ , ఆపై ఆయన చిరకాల మిత్రుడు నాగరాజు మరణాలతో తీవ్ర శోకంలో ఉన్న ఆయనకు ఇప్పుడు జీహెచ్ఎంసీ నుంచి ఊహించని షాక్ తగిలింది. నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఆయనకు చెందిన వాణిజ్య భవనంపై అనుమతులు లేకుండా పెంట్‌హౌస్ నిర్మించడమే ఇందుకు కారణం. ఈ అక్రమ నిర్మాణాన్ని ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు ఆ నోటీసులో స్పష్టం చేశారు. అల్లు అరవింద్ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో సుమారు వెయ్యి గజాల స్థలంలో 'అల్లు బిజినెస్ పార్క్' పేరుతో ఒక వాణిజ్య భవనాన్ని నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో నాలుగు అంతస్తుల నిర్మాణానికి ఆయన జీహెచ్ఎంసీ నుంచి అధికారికంగా అనుమతులు పొందారు. ఈ భవనం నిర్మాణం సుమారు ఏడాది క్రితమే పూర్తయింది. అయితే, ఇటీవల ఈ భవనంపైన నిబంధనలకు విరుద్ధంగా అదనంగా ఒక పెంట్‌హౌస్‌ను నిర్మించారు. ఈ విషయం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి రావడంతో వారు రంగంలోకి దిగారు. ముందస్తు అనుమతులు లేకుండా నిర్మించిన ఈ పెంట్‌హౌస్‌ను అక్రమ నిర్మాణంగా పరిగణించి, అల్లు అరవింద్‌కు నోటీసులు జారీ చేశారు. తగిన వివరణ ఇవ్వని పక్షంలో చట్ట ప్రకారం కూల్చివేత చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబర్ లో అల్లు అర్జున్ ను తొక్కిసలాట ఘటనకు బాధ్యుడిగా చేసి అరెస్ట్ చేశారు. ఇపుడు జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. మునిసిపల్ శాఖ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉండగా, సీఎంకు సమాచారమిచ్చే నోటీసులు జారీచేసి ఉంటారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఎంతో సంపద, నిర్మాణాలు, ఆస్తులు కలిగిన అల్లు ఫ్యామిలీ అనుమతి లేని నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరమేంటన్న విమర్శలూ ఉన్నాయి.

## రాజకీయ చర్చలు

అల్లు అర్జున్ రాజకీయాల్లోకి రావొచ్చన్న చర్చ గత కొంతకాలంగా జరుగుతోంది. పుష్పతో పాన్ ఇండియా రేంజ్ లో మాస్ హిట్ కొట్టాడు. మళయాళంలో, నార్త్ లో పుష్ప అల్లు అర్జున్ కు ఫుల్ క్రేజ్ ఉంది. పుష్ప రిలీజ్ సమయంలో జరిగిన తొక్కిసలాట వ్యవహారంలో అగ్రశ్రేణి హీరోగా పేరున్న అల్లు అర్జున్ ను అరెస్ట్ చేయించిన సీఎం రేవంత్ రెడ్డి దీనిపై అసెంబ్లీలో, జాతీయ మీడియాలో కూడా మాట్లాడారు. హోంశాఖ కూడా సీఎం పరిధిలోనే ఉంది. ఇపుడు మునిసిపల్ శాఖ కూడా సీఎం పరిధిలోనే ఉంది. రాజకీయ కారణాలేమైనా ఉన్నాయా.. చట్టం తన పని తానే చేసుకుపోతున్నట్లు రెగ్యులర్ వ్యవహారంలో భాగంగానే జరిగిందా అన్నదానిపై రకరకాల విశ్లేషణలు సాగుతున్నాయి.

# ప్రధాని నివాసానికి నిప్పు

### హింసాత్మకంగా నేపాల్.. పీఎం కేపీ శర్మ ఓలీ రాజీనామా

- సోషల్ మీడియా బ్యాన్‌పై ఆగని హింసాకాండ.. దేశవ్యాప్త నిరసనలు
- పార్లమెంట్ భవనం, మంత్రుల ఇండ్లు ధ్వంసం చేసిన ఆందోళనకారులు



**మహా:** నేపాల్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. నిరసనకారులు ఏకంగా ప్రధాని నివాసానికే నిప్పుపెట్టడంతో పలువురు మంత్రులను రోడ్లపై తరిమారు. ఈ తరుణంలో ప్రధాని పదవికి కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. దాంతో ఆ దేశ పగ్గాలు సైన్యం చేతుల్లోకి వెళ్ళాయి. ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఓలీకి ఆర్మీ చీఫ్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలను సైన్యం అదుపులోకి తీసుకువస్తుందని పేర్కొన్నట్లు సమాచారం. ఓలీ రాజీనామా చేస్తే.. మిలిటరీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైనట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈ తరుణంలోనే రాజీనామా ప్రకటన వెలువడింది. దేశంలోని అస్థిర పరిస్థితుల వేళ.. త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని విమానాలను రద్దు చేశారు. 300 మంది సైనికులను అక్కడ మోహరించారు. మంత్రులను వారి అధికారిక నివాసాల నుంచి ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వద్ద హెలికాప్టర్ల కదలికలు కనిపిస్తున్నాయి. అలాగే రాజధాని కాఠ్‌మాండూలోని ఆర్మీ బ్యారక్స్‌లోకి వీఐపీలను తరలిస్తున్నారు.

### పార్లమెంట్‌లోకి చొరబడిన నిరసనకారులు..

సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో జరిగిన ఆందోళనల్లో అత్యధిక మంది యువత, పాఠశాల విద్యార్థులే పాల్గొనడం గమనార్హం. దీంతోపాటుగా రాజకీయ వారసత్వాలపై నిరసనలు కూడా మొదలయ్యాయి. వీటిని నెపోకిడ్ మూమెంట్‌గా పిలుస్తున్నారు. సంపన్న వర్గాల, రాజకీయ నాయకుల పిల్లలు అవినీతి సొమ్ముతో వచ్చే ఫలాలను అనుభవిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చి.. నిరసనకారులు పార్లమెంట్‌లోకి దూసుకువెళ్లారు. ఆ భవనానికి నిప్పంటించారు. మరోపక్క భక్తాపుర్‌లోని కేపీ శర్మ ఓలీ వ్యక్తిగత నివాసానికి నిప్పుపెట్టిన నిరసకారులు.. అది కాలిపోతుంటే డ్యాన్సులు చేస్తోన్న దృశ్యాలు మీడియాలో చక్కర్లు కొట్టాయి. సోషల్ మీడియాపై ప్రభుత్వ నిషేధం ఈ నిరసనలకు కారణంగా కనబడుతోంది. నిరసనకారుల ప్రకారం, ప్రభుత్వం జారీ చేసిన "కనపడిన వెంటనే కాల్చివేయండి" అనే ఆదేశాల వల్ల ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. సోమవారం 19 మంది మరణించినందుకు నిరసనగా, మంగళవారం కూడా నిరసనలు కొనసాగాయి. పోలీసులు ప్రయోగించిన టియర్ గ్యాస్, కాల్పుల్లో 300 మందికి పైగా గాయపడ్డారు.



కవితను చేర్చుకోవడమంటే..

# జగన్‌ను చేర్చుకోవడం

### నారా లోకేష్ సంచలన కామెంట్స్
### తెలంగాణపై ఫోకస్ చేస్తాం

**ఢిల్లీ, మహా:**
కల్వకుంట్ల కవితను టీడీపీలో చేర్చుకోవడం అంటే.. జగన్‌ను టీడీపీలో చేర్చుకోవడం లాంటిదేనంటూ టీడీపీ నేత నారా లోకేష్ సంచలన కామెంట్స్ చేశారు. కవిత టీడీపీలో చేరే ఛాన్స్ ఉందన్న ప్రచారం గత కొద్ది రోజులుగా సాగుతోంది. ఈ అంశంపై నారా లోకేష్ స్పందించారు. కేటీఆర్‌ను గతంలో చాలా సార్లు కలిశానన్నారు. కేటీఆర్‌ను కలిస్తే తప్పేంటి..? అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి వైసీపీ సభ్యులు ఓటు వేయడంపై సైతం లోకేష్ స్పందించారు. ఆ అభ్యర్థికి ఓటు ఎందుకు వేశారో జగన్ ను అడగాలన్నారు. రానున్న 2029 ఎన్నికల్లో కూడా తాము మోదీకే మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందన్నారు. దేవాన్ష్ పొలిటికల్ ఎంట్రీపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలపై సైతం లోకేష్ ఫన్నీ ఆన్సర్ ఇచ్చారు. దేవాన్ష్ ఎందుకు రాజకీయాల్లో వస్తారు అనుకుంటున్నారు? అని ప్రశ్నించారు. అతను హ్యాపీగా చెస్ ఆడుకుంటున్నాడన్నారు. తెలంగాణలో టీడీపీ ఫోకస్ చేస్తున్నదన్నారు. తమకు ఆ రాష్ట్రంలో కార్యకర్తలు ఉన్నారన్నారు. ఈ అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

ఉపరాష్ట్రపతిగా

# రాధాకృష్ణన్

### జస్టిస్ సుదర్శన్ పై గ్రాండ్ విక్టరీ

అభినందించిన ప్రధాని మోదీ

ఎన్డీఏ సామర్థ్యం కంటే అధిక ఓట్లు.. 15 ఓట్లు క్రాస్

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఎన్నికకు బీఆర్ఎస్, బీజేడీ, అకాలీదళ్ సభ్యులు పోలింగ్ కు దూరంగా ఉన్నాయి. పార్లమెంట్ నూతన భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు వెల్లడించారు. కాగా నూతన వైస్ ప్రెసిడెంట్ ను ప్రధాని మోదీ తో సహా సీఎంలు, కేంద్రమంత్రులు, ఎంపీలు అభినందించారు.

### క్రాష్ ఓటింగ్‌కు పాల్పడిన ఎంపీలు..

ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ కు ఊహించిన దాని కంటే ఎక్కువగా ఓట్లు పొందారు. ఇండియా కూటమికి చెందిన అభ్యర్థికి మద్దతుదారుల నుంచి పూర్తి స్థాయిలో అయితే ఓట్లు రాలేదు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు మొత్తం 452 ఓట్లు వచ్చాయి. ఇది ఎన్డీఏ ఎంపీల మొత్తం సామర్థ్యం కంటే ఎక్కువ. జస్టిస్ సుదర్శన్‌కు ఇండియా కూటమి నుంచి రావాల్సిన ఓట్లు రాలేదని తెలుస్తోంది. తమిళనాడు డీఎంకే ఎంపీలు రాష్ట్ర అభిమానంతో క్రాష్ ఓటింగ్‌కు పాల్పడినట్లు అంచనా వేస్తున్నారు. ఇండియా కూటమికి బిగ్ షాక్ ఇచ్చి ఎన్డీఏకు ఓట్లు వేసినట్లు తాజా ఫలితాల్లో తెలుస్తోంది.

# నేపాల్ పరిస్థితి ఏ దేశంలోనైనా రావొచ్చు

### మోదీని ట్యాగ్ చేసి సంజయ్ రౌత్ ట్వీట్

**ఢిల్లీ, మహా :** నేపాల్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని ఉదాహరణగా చూపిస్తూ శివసేన (యూబీటీ) నేత, ఎంపీ సంజయ్ రౌత్ కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "నేపాల్‌లో నేడు నెలకొన్న పరిస్థితి ఏ దేశంలోనైనా ఏర్పడవచ్చు, జాగ్రత్త!" అంటూ ఆయన చేసిన ట్వీట్ రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మంగళవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన అల్లర్లకు సంబంధించిన వీడియోను పంచుకున్నారు. తన పోస్టుకు ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీని నేరుగా ట్యాగ్ చేశారు. "నేపాల్ ఈరోజు ఇలా ఉంది... ఈ పరిస్థితి ఏ దేశంలో అయినా ఏర్పడవచ్చు. జాగ్రత్త! భారత్ మాతా కీ జై, వందే మాతరం" అని తన పోస్టులో పేర్కొన్నారు. రౌత్ పోస్ట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఆయన మద్దతుదారులు అవినీతిపై ఇది సరైన హెచ్చరిక అని సమర్థించగా, విపక్షాలు దేశంలో అల్లర్లను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పలువురు విమర్శించారు.

సీఎం రేవంత్ నోరు విప్పితే

# గోబెల్ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

'ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మేమే కట్టం అంటున్నావు.. కత్తెర పట్టుకొని కేసీఆర్ కట్టినవి కట్ చేస్తున్నావ్.. పేర్లు మార్చుడు, కత్తెర పట్టుకొని కేసీఆర్ తిరగలేదు. ఎల్లంపల్లి కోసం 2 వేల కోట్లు ఖర్చు పెట్టాము. రేవంత్ ప్రారంభోత్సవం చేసిన ఫ్లై ఓవర్లు, డ్యాములు కేసీఆర్ హాయంలోనివే. ఎల్లంపల్లి ద్వారా 20టీఎంసీ హైదరాబాద్‌కు ఎలా తెస్తావు.. సీఎం కుర్చీకి గౌరవం పోగొడుతున్నావు. కాళేశ్వరం మోటర్లతోనే నీళ్లు ప్రాజెక్టులకు వస్తున్నాయి. కేసీఆర్ ముందుచూపుతో మల్లన్నసాగర్ నిర్మించారు. గండిపేట, హిమాయత్ సాగర్ కి వచ్చే నీళ్లు కాళేశ్వరం నీళ్లే. కాళేశ్వరంలో 12 రిజర్వాయర్లు అందులో భాగమే మల్లన్న సాగర్. మల్లన్న సాగర్ నుండి హైదరాబాద్‌కు నీళ్లు తెస్తా అంటే నీళ్లు ఎక్కడివి..?, కాళేశ్వరం నీళ్లే మల్లన్న సాగర్‌కి వస్తాయి' అని హరీశ్ రావు అన్నారు.

**నేను ఇచ్చిన అని చెప్పుకుంటున్నాడు..**

'కేసీఆర్ ముందు చూపుతో హైదరాబాద్ మంచి నీటి కోసం మల్లన్న సాగర్‌లో స్లూయిస్ కూడా నిర్మించి పెట్టిండు. గండిపేట దగ్గర కొబ్బరికాయ కొట్టినవంటే ఆ గండిపేటకు హిమాయత్ సాగర్‌కి వచ్చే నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు.. అవి కాళేశ్వరం మోటార్ల ద్వారా వచ్చే నీళ్లు. కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెన్, 203 కిలోమీటర్ల టన్నెల్లు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్. ఈ 15 రిజర్వాయర్లలో ఒక రిజర్వాయర్ మల్లన్న సాగర్. ఇది కాళేశ్వరంలో అంతర్భాగము. కాళేశ్వరం కోసం ఖర్చు చేసిన 93 వేల కోట్లలో నిర్మించింది మల్లన్న సాగర్.. కామన్ సెన్స్ లేకుండా మాట్లాడితే ముఖ్య




మంత్రి కుర్చీకున్న గౌరవం తగ్గుతుంది రేవంత్ రెడ్డి.. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన విజయాలను కూడా తన విజయంగా రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నాడని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కేసీఆర్ నోటిఫికేషన్ ఇచ్చి ఎగ్జామ్ పెట్టి ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తి చేస్తే కేవలం కాగితం ఇచ్చి ఈ ఉద్యోగాలు నేను ఇచ్చిన అని చెప్పుకుంటున్నాడు రేవంత్ రెడ్డి.. ఖమ్మం జిల్లా సీతారామ ప్రాజెక్టు మూడు పంప్ హౌస్‌లు కట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వం. టన్నెల్స్, సబ్ స్టేషన్లు, కెనాల్స్ పూర్తి చేసింది బీఆర్ఎస్. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి బటన్ నొక్కి సీతారామ ప్రాజెక్టు మేమే నిర్మించినమని చెప్పుకుంటున్నారు.. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ దగ్గర మీ మంత్రులే నీళ్లు విడుదల చేసి నెత్తి మీద చల్లుకుంటున్నది నిజం కాదా..? అని హరీశ్ రావు నిలదీశారు.

# గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

సంజయ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను గుర్తుచేసింది న్యాయస్థానం. ఆ మార్గదర్శకాల ప్రకారం పున:మూల్యాంకనం జరపాలని ఆదేశాలు ఇచ్చింది. లేని పక్షంలో మెయిన్స్ పరీక్షలు రద్దు చేయాల్సి వస్తుందని స్పష్టం చేసింది.

**ప్రధాన సమస్యలు ఉన్నాయని పలువురు హైకోర్టుకు..**

గ్రూప్ 1 పరీక్ష వివాదస్పదమైన విషయం తెలిసిందే. గ్రూప్ 1 మూల్యాంకనం అవకతవకలు జరిగాయని హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. పరీక్షలు రద్దు చేయాలని కొందరు, ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వుల దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయకూడదు అంటూ మరికొందరు హైకోర్టుల వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అయితే పరీక్షల సమయంలో జెల్ పెన్నులు, కోఠి మహిళా కళాశాల నుండి ఎక్కువ అభ్యర్థుల ఎంపిక, తెలుగు మీడియం అభ్యర్థులు తక్కువ ఎంపిక, కేవలం రెండు పరీక్షా కేంద్రాల నుంచి అత్యధిక స్కోరు సాధించిన వారి సంఖ్య పెరగడం వంటి ప్రధాన సమస్యలు ఉన్నాయని పలువురు హైకోర్టుకు వెళ్లారు. ఇంకోవైపు హైకోర్టు తీర్పుతో గ్రూప్ 1 కు ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

**నియామకాల కథ మొదటికి..**

నియమకాల కోసం వెయిటింగ్ చేస్తున్న వారికి గుండెల్లో పిడుగు పడినట్టైంది. తాజాగా హైకోర్టు తీర్పుతో గ్రూప్ 1 నియామకాల కథ మొదటికొచ్చింది. హైకోర్టులో కేసు విచారణ కారణంగా టీజీపీఎస్సీ నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇప్పుడు రీవాల్యూయేషన్‌కు హైకోర్టు ఆదేశించింది. అవకతవకలు లేకుండా రీవాల్యూయేషన్ జరిపించాలని తెలిపింది. ఆ తర్వాతే వాటి ఆధారంగా ర్యాంకులు ఇవ్వాలని, అది సాధ్యం కాకపోతే.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని చెప్పింది. అయితే సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేసే యోచనలో టీజీపీఎస్సీ ఉన్నట్టుగా సమాచారం.

# ప్రభుత్వానికి ఈ-కార్ రేస్ కేసు నివేదిక

### కేటీఆర్ పై ఏసీబీ ఛార్జ్ షీట్ వేసే అవకాశం.. ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్, మహా:** ఫార్ములా ఈకార్ రేస్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు రెండుసార్లు విచారించారు. అలాగే ఐఏఎస్ ఆఫీసర్ అరవింద్‌ను మూడుసార్లు ప్రశ్నించారు. తాజాగా నివేదిక సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే కేటీఆర్, అరవింద్ కుమార్‌పై ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది డిసెంబర్ నెలలో ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ మీద ఏసీబీ కేసు నమోదైంది. ఫార్ములా ఈ కార్ రేస్ కోసం రూల్స్‌కు విరుద్ధంగా విదేశీ కంపెనీకి డబ్బులు చెల్లించారని మున్సిపల్ శాఖ కార్యదర్శి ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. దీని వల్ల ప్రభుత్వానికి రూ.54.88 కోట్లు నష్టం కలిగిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏసీబీ కేసు నమోదు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు.

### నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న..

ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. అలాగే అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్‌ను ఏ2గా చేర్చారు. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఏ3గా ఉన్నారు. ఫార్ములా ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములాఈ ఆపరేషన్స్, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది.





# తెలంగాణ రాజకీయాలపై కవిత ముద్ర

(హైదరాబాద్ - మహా)

తెలంగాణ రాజకీయాల్లో కవిత ముద్ర స్పష్టమని, కవిత బీఆర్ఎస్ నుండి బయటకు రావడం వల్ల తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారుతుందని వోటా సర్వేలో మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లో ర్యాండమ్ గా నిర్వహించిన సర్వేలో కవిత రాజకీయ భవిష్యత్తుపై ప్రదానంగా ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. కవిత రాజీనామా ఊహించిందేనని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. ఈ సర్వే వివరాలను పబ్లిక్ డొమైన్ లో విడుదల చేశారు.

## కవితకు మద్దతుగా నిలుస్తాం...

కవిత రాజకీయ పార్టీ పెడితే మద్దతుగా నిలుస్తామన్న వారి సంఖ్య కూడా భారీగా ఉంది. మద్దతునిస్తామని 31 శాతం, ఇవ్వం -25 శాతం, ఎజెండాను బట్టి నిర్ణయం తీసుకుంటామని 44 శాతం మంది చెప్పారు. కవిత రాజీనామా వల్ల తెలంగాణ రాజకీయాల్లో మార్పు ఉంటుందని 40 శాతం, ఉండదని 20 శాతం మంది చెప్పగా, మిగతా వారు ఇపుడే చెప్పలేమన్నారు. మంచి ఊపుమీదున్న బీఆర్ఎస్ గాలి కవిత తీసేశారని, రానున్న రోజుల్లో కవిత మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని, కేసీఆర్ కుటుంబ గొడవల వల్ల కాంగ్రెస్, బిజెపి లాభపడతాయని, నిజామాబాద్ లో ఆమెను కావాలని ఓడించారు.. వారి వెనుక హరీష్ ఉన్నాడని, సంతోష్, హరీష్ ల గురించి కవిత చెప్పినదాంట్లో తప్పలేదని, హరీష్ రావు కవితకు గట్టి రిప్లయ్ ఇవ్వకపోవడం మైనస్ అని, కవిత జాగ్రుతి వల్ల బీఆర్ఎస్ కూడా లాభపడిందని, హరీష్ రావు ప్రజల మనిషి ఆయనను ఎవరూ ఏం చేయలేరని, కేటీఆర్ ముఖం మీద అంటాడు.. హరీష్ మనసులో పెట్టుకుని పగ సాధిస్తాడని, చివరకు కుటుంబమంతా ఒకటే అవుతారని అభిప్రాయసేకరణ సందర్భంగా పలువురు కామెంట్స్ చేశారు. బీసీ ఎజెండా ఎత్తుకోవడం వల్ల కవితకు పెద్దగా ప్రయోజనం లేదని ఎక్కువమంది చెప్పారు. లిక్కర్ స్కాంలో కవిత పాత్ర కొంతమేర ఉందని 48శాతం అభిప్రాయపడగా, 24 శాతం మంది ఉందని అభిప్రాయ వ్యక్తం చేశారు. మిగతా వారు పాత్ర లేదన్నారు.

1. కవిత రాజీనామా వల్ల బీఆర్ఎస్ బలహీనపడుతుందా?
అవును-15, కొంతమేరకు - 41, ఏం కాదు -31
2. భవిష్యత్తులో కవిత సొంత పార్టీ పెడతారని భావిస్తున్నారా?
అవును సొంతపార్టీ పెడతారు -71 శాతం, కాంగ్రెస్ - 4 శాతం, బీజేపీ-1, స్వతంత్రంగా -16
3. కవిత సొంత పార్టీ పెడితే మీరు మద్దతిస్తారా?
అవును- 31 శాతం, ఇవ్వం -25 శాతం, ఎజెండాను బట్టి- 44 శాతం
4. బీఆర్ఎస్ మద్దతు లేకున్నా కవిత బలమైన నాయకురాలేనా?
అవును -25 శాతం, కాదు-54 శాతం,
5. హరీష్ సంతోష్ లపై కవిత చేసిన ఆరోపణలను మీరు నమ్ముతున్నారా?
అవును - 44 శాతం, కాదు -15 శాతం, కొంతమేరకు - 27 శాతం
6. కవిత రాజీనామాకు ఎవరు కారణమని అనుకుంటున్నారు?
హరీష్ -27 శాతం, సంతోష్ - 8 శాతం , ఇంటి గొడవలు - 34 శాతం, రేవంత్ -19 శాతం
7. కవిత రాజీనామా వల్ల ఏ పార్టీకి కలిసొస్తుంది?
కాంగ్రెస్ - 76 శాతం, బిజెపి-18, బిఆర్ఎస్ -4
8. కల్వకుంట్ల కుటుంబంలో గొడవలకు కారణం?
ఆస్తుల తగాదా- 25 శాతం, వారసత్వం లొల్లి- 35 శాతం, అవినీతి వాటాలు -25 శాతం

# 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు మంజూరు చేయండి

## ఆర్ఆర్ఆర్ (నార్త్) పనుల ప్రారంభానికి అనుమతులివ్వండి

- మన్ననూర్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతించండి
- హైదరాబాద్ మంచిర్యాల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయండి
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి వినతి
- సీఆర్ఐఎఫ్ పనులకు వారంలోపు అనుమతులు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ



**ఢిల్లీ:** భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి వెంటనే అనుమతులు మంజూరు చేయాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం కూడా తెలంగాణఆంధ్ర ప్రదేశ్ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉందని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు సముద్ర రేవు లేనందున బందరు పోర్ట్ వరకు సరకు రవాణాకు వీలుగా గ్రీన్ ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో 118 కిలో మీటర్లు తెలంగాణలో ఉంటుందని, మిగతా భాగం ఏపీలో ఉంటుందని సీఎం వివరించారు. నితిన్ గడ్కరీతో రేవంత్ రెడ్డి ఢిల్లీలోని ఆయన నివాసంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతులు, పనుల వేగవంతంపై చర్చించారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డుకు (నార్త్) 90 శాతం భూ సేకరణ పూర్తయినందున వెంటనే ఫైనాన్షియల్, క్యాబినెట్ అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు.

### వారంలోపు అనుమతులు ఇస్తాం..

ఆర్ఆర్ఆర్ (నార్త్)కు సమాంతరంగా ఆర్ఆర్ఆర్ (సౌత్) పనులు చేపట్టాలని, ఇందుకుగానూ వెంటనే అన్ని అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలంతో అనుసంధానించే మన్ననూర్ శ్రీశైలం రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్నందున నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే ఏపీలోని కృష్ణపట్నం రేవుతో పాటు మార్కాపురం, కంభం, కనిగిరి, నెల్లూరులకు రాకపోకలు సులువవుతాయని సీఎం తెలిపారు. రావిర్యాలఆమన్‌గల్‌మన్ననూర్ నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌మంచిర్యాల మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై వాహన రద్దీ అధికంగా ఉన్నందున హైదరాబాద్‌మంచిర్యాల మధ్య నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ్ కింద రూ.868 కోట్లతో పంపిన రహదారుల పనులను మంజూరు చేయాలని కోరారు. సీఎం విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ పనులకు వారంలోపు అనుమతులు ఇస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీఅమరావతిబందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించి తమ శాఖ అధికారులను హైదరాబాద్‌కు పంపుతానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

# మావోయిస్టు కొత్త దళపతి తిరుపతి

## నంబాల కేశవరావు మరణంతో కేంద్ర కార్యదర్శి పదవి ఖాళీ

### కొత్తగా తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ నియామకం

### మావోయిస్ట్ సెంట్రల్ చీఫ్ కుర్చీపై తెలంగాణ వ్యక్తి



**హైదరాబాద్, మహా:** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కొత్త కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి నియామితులయ్యారు. నంబాల కేశవరావు ఎన్ కౌంటర్ తో ఖాళీయైన పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి పదవికి మరో తెలుగువాడైన తిప్పిరి తిరుపతి నియామితులు కావడం విశేషం. ప్రస్తుతం పార్టీ సెంట్రల్ కమిషన్ చీఫ్ గా ఉన్న తిరుపతి గ్రీన్ హంట్ సమయంలో బెంగాల్లో లాల్ గఢ్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. మావోయిస్టు పార్టీలో సెకండ్ క్యాడర్ లో ఉన్న తిరుపతి అలియాస్ దేవ్ జీ పార్టీ దాడులకు వ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు. పార్టీలో కేజీ సత్యమూర్తి, కొండపల్లి సీతారామయ్య, గణపతి, నంబాల తర్వాత మరోసారి తెలుగు వాడైన తిరుపతికి కీలకమైన మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి బాధ్యతలు దక్కడం గమనార్హం. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో మరో తెలుగువాసి తిరుపతి తో పాటు మల్లోజుల వేణుగోపాలరావు పార్టీ పొలిటికల్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నట్లుగా సమాచారం.

**తెలంగాణ వ్యక్తి ఉద్యమ ప్రస్థానం..**

కరీంనగర్ జిల్లా కోరుట్లలోని అంబేద్కర్ నగర్ కు చెందిన తిరుపతి 1983లో డిగ్రీ చదువుతున్న క్రమంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ సభ్యుడిగా పనిచేశారు. పోలీసు కేసుల నేపథ్యంలో 1983లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. దళ సభ్యుడి నుంచి పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, మిలిషియా దాడుల వ్యూహకర్తగా పార్టీలో రెండో పొషిషన్ కు ఎదిగాడు. తిరుపతిపై రూ. 1కోటి రూపాయల రివార్డు ఉంది. మిలిషియ మెరుపు దాడులు జరిపి తప్పించుకోవడంలో దిట్టగా తిరుపతికి పేరుంది. చంద్రబాబుపై అలిపిరి దాడిలో నంబాల కేశవరావుతో పాటు తిరుపతి కూడా ఉన్నాడని అప్పట్లో ప్రచారం జరిగింది. 201లో దంతెవాడలో 74మంది సీఆర్ఎఫ్ జవాన్లను చంపిన దాడికి తిరుపతి సారధ్యం వహించాడని పోలీసు వర్గాల కథనం. ఆపరేషన కగార్ నేపథ్యంలో తిరుపతి ప్రస్తుతం బెంగాల్ సరిహద్దుల్లో షెల్టర్ తీసుకున్నాడని ఇంటలిజెన్స్ భావిస్తుంది.



# ఏసీబీకి చిక్కిన నార్సింగ్ టౌన్ ప్లానింగ్ అధికారి

**నార్సింగ్, మహా:** తెలంగాణలో ఎక్కడికక్కడ ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తూ అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతున్న కొందరిలో మాత్రం అస్సలు మార్పు రావడం లేదు. మనల్ని ఎవరులే పట్టుకునేది అనేలా జనాల నుంచి లంచాలు లాగేస్తున్నారు. తాజాగా ఇలానే ఒక పనిచేసిపెట్టేందుకు ఒక అధికారిని ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్ చేసింది. అడ్వాన్స్‌గా రూ.4లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ లోని నార్సింగి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న మణిహారిక.. మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల రాధ రియల్టర్ వెంచర్‌లో ఒక ప్లాట్‌కు ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) క్లియరెన్స్ ఇచ్చేందుకు వినోద్ అనే వ్యక్తి నుంచి మణిహారిక రూ.10 లక్షలు డిమాండ్ చేసింది. ఈ క్రమంలో వినోద్ నుంచి టౌన్ ప్లానింగ్ అధికారిని రూ.4 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎంట్రీ ఇచ్చిన ఏసీబీ అధికారులు ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె నుంచి డబ్బును స్వాధీనం చేసుకొని ఘటనపై కేసు నమోదు చేశారు. వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మణిహారిక పనిచేస్తున్న మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుతం సోదాలు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

EDITORIAL సంపాదకీయం

# పీపుల్స్ సీఎం



నిఖార్సయిన నాయకులే చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. అది కేవలం వారు అధిష్టించిన సింహాసనం వల్ల కాదు. వారికున్న హోదా వల్ల రాదు. ప్రజల ప్రేమాభిమానాల వల్లనే అది సాధ్యం. నిత్యం ప్రజలతో మమేకమవుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన పనితీరుతో నిఖార్సయిన నేతకు ప్రతిబింబంగా నిలుస్తున్నారు. అధికార కుర్చీకే పరిమితమవ్వకుండా ఆయన నిత్యం ప్రజల మధ్య ఉంటున్నారు. ఎలాంటి హంగూ ఆర్భాటాలు లేకుండా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని తక్షణమే పరిష్కరిస్తూ 'ప్రజా సేవకుడిగా' ప్రజా పాలన అందిస్తున్నారు. గత పదేళ్ల కేసీఆర్ ఫాం హౌస్ పాలన ప్రజలకు విసుగు తెప్పించాయి. ముఖ్యమంత్రి అంటే మన కోసం, మన మధ్యలో ఉండాలని ఆకాంక్షతో తెలంగాణ ప్రజలు 'ప్రజా ప్రభుత్వాన్ని' ఏరికోరి తెచ్చుకున్నారు. గత ఇరవై నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి వేస్తున్న అడుగులను గమనిస్తే... ఆయన ప్రజల మనోభావాలకు అనుగుణంగా, కేసీఆర్ పాలనకు భిన్నంగా పని చేస్తున్నారని అర్థమవుతోంది. నిత్యం ప్రజలతో మమేకమవడం సంక్షోభ సమయాలలో వేగంగా స్పందించడం, సామాన్యుడిగా నడుచుకోవడం ఇవన్నీ ఆయన ప్రత్యేకతలను తెలుపుతున్నాయి. ప్రజలతో మమేకమయ్యే ధోరణి, నిత్యం వారికి అందుబాటులో ఉండడం సీఎం రేవంత్ రెడ్డికి మంచి గుర్తింపు తెచ్చాయి.

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మంగా నిర్వహించే గణేశ్ నిమజ్జన వేడుకలకు ఆయన ఎలాంటి ఆర్భాటం లేకుండా ఒక సాధారణ భక్తుడిలా ట్యాంక్ బండ్ పరిసరాలకు వచ్చి ప్రజలతో కలిసిపోయి సంబురాలు చేసుకున్నారు. వారితో కలిసి ''గణపతి బప్పా మోరియా'' అంటూ నినాదాలు చేశారు. ఒక ముఖ్యమంత్రి తన హోదాను పక్కన పెట్టి సాధారణ ప్రజలతో కలిసిపోవడం బహుశా ఇదే తొలిసారి కావొచ్చు. ఆయన వ్యవహార శైలీపై గణేశ్ ఉత్సవ సమితి కూడా హర్షం వ్యక్తం చేసింది. సీఎం మన మధ్యలోనే ఉన్నారా అంటూ ఆశ్చర్యపోయిన సాధారణ భక్తులు ఆయనను ఆత్మీయంగా పలకరిస్తూ సెల్ఫీలు తీసుకోవడానికి పోటీ పడ్డారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కాగా ''ఆయన ముఖ్యమంత్రి అయినా మనలాంటి మనిషే'' అంటూ ప్రజలు మెచ్చుకుంటున్నారు. ఇది కేవలం పబ్లిసిటీ స్టంట్ కాదని, నిజంగానే రేవంత్ వైఖరిని ప్రతిబింబించే సంఘటన అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికి ఉదాహరణగా ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనబరుస్తున్న పరిణితిని వారు గుర్తు చేస్తున్నారు. ప్రతిపక్షనేత కేసీఆర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నప్పుడు మానవతా దృక్పథంతో రేవంత్ రెడ్డి వెళ్లి పలకరించడాన్ని ఎవ్వరూ మర్చిపోలేరు.

నాయకుడి గుణ గణాలు సంక్షోభ సమయాల్లోనే పరీక్షించబడుతాయి. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులను కలవడానికి సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఒక మామూలు మనిషిలా వెళ్లారు. వరదల ప్రభావిత కాలనీలలోని ప్రజలతో నేరుగా మాట్లాడి వారి గోడును విన్నారు. అధికారులు సంవత్సరాలుగా వాయిదా వేస్తున్న మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యలపై అక్కడికక్కడే చర్చించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి పర్యటనలు ప్రజల్లో భరోసా కల్పించడమే కాదు, పాలనలో మార్పును సూచించే సంకేతాలుగా నిలబడిపోతాయి.

కనివినీ ఎరుగని వరదలతో తీవ్రంగా నష్టపోయిన కామారెడ్డితో సహా ఇతర ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించేందుకు సీఎం రెవంత్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాలను అధ్యయనం చేసి అధికారులకు సలహాలు, సూచనలతో పాటు తీసుకోవాల్సిన తక్షణ సహాయంపై ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సహాయం కోసం తక్షణమే 200 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేయడం ఆయన వేగంగా తీసుకునే నిర్ణయ సామర్థ్యానికి నిదర్శనం. ముఖ్యమంత్రి వెంట టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు కూడా కలసి ఏరియల్ సర్వేలో పాల్గొన్నారు. ఆయన రాజకీయాలకు అతీతంగా స్థానిక బీజేపీ ఎమ్మెల్యేని కూడా కలుపుకొని పోయి బాధితుల ఇబ్బందులను సమీక్షించి వారిలో భరోసా కలిగించారు. ఇది ముఖ్యమంత్రి మంచితనం వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆయన పనితీరును చూసినవారు ''పదవి కోసం కాకుండా, ప్రజల కష్టం తెలుసుకునే నాయకుడిగా పనిచేస్తున్నారు'' అని సకలజనులు ఆనందంగా చెప్పుకుంటున్నారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో కేసీఆర్ ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదు. ఆ పార్టీలో అగ్రనాయకులమని చెప్పుకునే వారు కూడా ఉస్మానియా యూనివర్సిటీని పట్టించుకోలేదు. అయితే వారికి భిన్నంగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టి, ఉద్యమకారులకు తెలంగాణపై తనకున్న ప్రేమను చేతల్లో చూపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని పదేళ్ల తరువాత సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే కావడం విశేషం. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుతూనే, భవిష్యత్‌లో వర్సిటీ అభివృద్ధికి కీలక ప్రకటన చేశారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ తరహాలో ఉస్మానియాను అభివృద్ధి చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఒక నాయకుడి దూరదృష్టిని ప్రతిబింబించే స్వభావం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది.



- అమరవాజి నాగరాజు,
పి.ఆర్.ఓ, టీపీసీసీ ప్రెసిడెంట్

ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, సీఎం రేవంత్ రెడ్డిని ప్రజలు ఒక విభిన్నమైన నాయకుడిగా గుర్తిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ విశ్వాసం ఆయనకు ఆస్తిగా మారి కాంగ్రెస్‌కు లబ్ది చేకూర్చడం ఖాయం. తెలంగాణ ప్రజలు నిత్యం అందుబాటులో ఉండే ముఖ్యమంత్రిని కోరుకున్నారు. సోదరుడిలా, స్నేహితుడిలా తమ బాధలను విని స్పందించే నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గం, టీపీసీసీ అదే బాటలో నడుస్తున్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంగా పాలిస్తూ ప్రజా పాలన అందిస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో ప్రజానాయకుడిగా నిలబడి, కొత్త తరహా నాయకత్వానికి ఆదర్శంగా మారడం ఖాయం.

> “ హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మంగా నిర్వహించిన గణేశ్ నిమజ్జన వేడుకలకు ఆయన ఎలాంటి ఆర్భాటం లేకుండా ఒక సాధారణ భక్తుడిలా ట్యాంక్ బండ్ పరిసరాలకు వచ్చి ప్రజలతో కలిసిపోయి సంబురాలు చేసుకున్నారు. వారితో కలిసి “గణపతి బప్పా మోరియా” అంటూ నినాదాలు చేశారు. ఒక ముఖ్యమంత్రి తన హోదాను పక్కన పెట్టి సాధారణ ప్రజలతో కలిసిపోవడం బహుశా ఇదే తొలిసారి కావొచ్చు.

> “ నాయకుడి గుణ గణాలు సంక్షోభ సమయాల్లోనే పరీక్షించబడుతాయి. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షా ల సమయంలో హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులను కలవడానికి సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి ఒక మామూలు మనిషిలా వెళ్లారు. వరదల ప్రభావిత కాలనీలలోని ప్రజలతో నేరుగా మాట్లాడి వారి గోడును విన్నారు. అధికారులు సంవత్సరాలుగా వాయిదా వేస్తున్న మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యలపై అక్కడికక్కడే చర్చించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇలాంటి పర్యటనలు ప్రజల్లో భరోసా కల్పించడమే కాదు, పాలనలో మార్పును సూచించే సంకేతాలుగా నిలబడిపోతాయి.

> “ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీలో కేసీఆర్ ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదు. ఆ పార్టీలో అగ్రనాయకులమని చెప్పుకునే వారు కూడా ఉస్మానియా యూనివర్సిటీని పట్టించుకోలేదు. అయితే వారికి భిన్నంగా రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఉస్మానియా యూనివర్సిటీలో అడుగుపెట్టి, ఉద్యమకారులకు తెలంగాణపై తనకున్న ప్రేమను చేతల్లో చూపించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని పదేళ్ల తరువాత ఇలా సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే .

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

# నిన్న శ్రీలంక.. బంగ్లాదేశ్.. నేడు నేపాల్

ప్రజలు తిరగబడితే ఎంతటి నియంతలైనా కూలిపోవాల్సిందే. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును ఎంతోకాలం అణచివేయలేరని నిన్న శ్రీలంక, బంగ్లాదేశ్.. ఇపుడు నేపాల్ సంఘటనలు రుజువు చూపుతున్నాయి. తప్పులను, దుర్మార్గ పాలనను ప్రజలు ఎంతోకాలం సహించడం లేదని ఆయా దేశాల్లో జరిగిన సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. దక్షిణాసియాలో ప్రజల్లో చైతన్యం కట్టలుతెంచుకుని పాలకులను మార్చేస్తున్నారు. ప్రజలను మరిచి సొంత ఆస్తులు కూడబెట్టుకుంటున్నవారిని అదే స్థాయిలో శిక్షిస్తున్నారు. ప్రజల ఆగ్రహం ఇప్పటికే శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వాలను కూలదోసి, ఇప్పుడు నేపాల్ ను కూడా అతలాకుతలం చేసింది. గత రెండేళ్లలో ఈ మూడు దేశాలలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు తీవ్రమయ్యాయి. ఈ ఆందోళనలు కేవలం వీధులను హింసతో నింపడమే కాకుండా.. పాలకుల సింహాసనాలను కూడా కూలదోశాయి. ఆర్థిక సంక్షోభం, అవినీతి, యువతలో నిరాశ వంటి సమస్యలను పాలకులు పట్టించుకోకపోవడం వల్ల దశాబ్దాలుగా అధికారంలో ఉన్న నాయకులు తమ పాలనను కోల్పోవలసి వచ్చింది. ప్రజలను పట్టించుకోని పాలకులకు.. ప్రజలే గుణపాఠం చెబుతున్నారు. ఓటు ద్వారా రాతమార్చే అవకాశం ఇవ్వనిచోట హింసను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రధానులు పరారు కావాల్సిన దుస్థితి దేశాల్లో నెలకొంది. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతును ఎంతోకాలం అణచివేయలేరని ఈ సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

**శ్రీలంకలో.. రాజపక్స.. బంగ్లాదేశ్ లో హసీనా..**

శ్రీలంకలో రాజపక్స కుటుంబం పతనం, బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడం, ఇప్పుడు నేపాల్‌లో కేపీ శర్మ ఓలీ రాజీనామా.. ఒక ప్రజాస్వామ్య దేశంలో ప్రజల గొంతును అధికార బలంతో అణచివేయలేమని స్పష్టం చేస్తున్నాయి. ప్రజల గొంతుకను, వారి డిమాండ్లను, వారి హక్కులను ఎవరూ ఎక్కువ కాలం అణచివేయలేరని ఈ ప్రభుత్వాల పతనంతో తేలిపోయింది. నేపాల్‌లో కూడా అదే జరిగింది. నేపాల్ ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌పై నిషేధం విధించగానే.. ప్రజలు ఓలీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి పడగొట్టారు. ప్రధానే రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రజలు తిరగబడితే ఎంతటి నియంతలైనా కూలిపోవాల్సిందే.





**శ్రీలంకలో అతిపెద్ద సంక్షోభం**

శ్రీలంకలో రాజపక్స కుటుంబంపై ప్రజలు తిరగబడ్డారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న రాజపక్స కుటుంబం ఒక్కసారిగా తన సామ్రాజ్యాన్ని కోల్పోయింది. 2022లో శ్రీలంక చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక, రాజకీయ సంక్షోభాన్ని కళ్ళారా చూసింది. విదేశీ మారక నిల్వలు అయిపోవడం, ఇంధనం, మందుల కొరత, విపరీతమైన ద్రవ్యోల్బణం, అధిక అప్పుల కారణంగా ప్రజల జీవితాలు దారుణంగా క్షీణించాయి. దీనికి వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ప్రజలు ప్రధాని మహీంద రాజపక్స, అధ్యక్షుడు గోటబాయ రాజపక్సలను అధికారం నుంచి తరిమేయడమే కాకుండా.. వారి ఇళ్లను కూడా తగలబెట్టారు. అధ్యక్షుడు గోటబాయ రాజపక్స తన భవనాన్ని వదిలి పారిపోయాడు. నిరసనకారులు పార్లమెంట్ భవనం, రాష్ట్రపతి భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న రాజపక్స కుటుంబం ఒక్కసారిగా తన సామ్రాజ్యాన్ని కోల్పోయింది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం పతనం శ్రీలంక తర్వాత బంగ్లాదేశ్‌లో కూడా హింసాత్మక నిరసనలు మొదలయ్యాయి. 2024 ప్రారంభం నుంచి ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా యువత రోడ్లపైకి రావడం ప్రారంభించింది. విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల మద్దతుతో ఈ ఉద్యమం హింసాత్మకంగా మారడంతో 'దక్షిణాసియా ఐరన్ లేడీ'గా పిలువబడే ప్రధాని షేక్ హసీనా కూడా దేశం వదిలి పారిపోవలసి వచ్చింది. ప్రస్తుతం షేక్ హసీనా ఇండియాలో నివసిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో మొహమ్మద్ యూనస్ నాయకత్వంలో ఒక తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఇలా రెండు ప్రభుత్వాలు కూల్చిన చైతన్యం నేపాల్ యువతను ప్రేరేపించింది.

**అదే తరహాలో**

నేపాల్‌లో కేపీ శర్మ ఓలీ రాజీనామా శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో ఉన్న ఉద్యమాల తరహాలోనే, నేపాల్‌లో కూడా కేపీ శర్మ ఓలీ సర్కారు కూలిపోయింది. ఓలీ ప్రభుత్వం సోషల్ మీడియాపై నిషేధం విధించాలనే నిర్ణయం ప్రజల ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసింది. విద్యార్థులు, యువకులు ఈ నిర్ణయాన్ని భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం, అవినీతిని కప్పిపుచ్చడానికి చేసే ప్రయత్నంగా అభివర్ణించారు. ఆ తర్వాత ఖాఠ్మాండులో "జెన్‌జెడ్ విప్లవం" మొదలైంది. ఈ ఉద్యమం ఒక్కసారిగా దేశం మొత్తం విస్తరించింది. నిరసనకారులు పార్లమెంటును చుట్టుముట్టారు. నాయకుల ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారు. పోలీసులతో జరిగిన హింసాత్మక ఘర్షణలలో 20 మందికి పైగా మరణించారు. పరిస్థితి చేయి దాటి పోవడంతో సైన్యాన్ని రంగంలోకి దించాల్సి వచ్చింది. చివరికి ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లలో ప్రజలు రోడ్లపైకి రావడం.. దశాబ్దాలుగా ఉన్న రాజకీయ వ్యవస్థను కూలదోయడం, ప్రభుత్వాధికారులు ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేయకూడదని సూచిస్తున్నాయి. ప్రజల విశ్వాసాన్ని పోగొట్టుకోకుండా, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచకుండా, పారదర్శకంగా, జవాబుదారీగా పాలన సాగించాలని ప్రభుత్వానికి ఈ సంఘటనలు హెచ్చరిస్తున్నాయి. లేకపోతే, ప్రజల సహనం నశించినప్పుడు, ఇలాంటి నాయకుల అధికారం ఎప్పటికీ అంతమవుతుందని స్పష్టం చేస్తున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ ప్రభుత్వాలపై ప్రజా తిరుగుబాటు.. పాలకులకు పాఠంలా కావాలి. ఏ దేశమైనా ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన ఉండాలి కానీ.. అణచివేత ఎంతోకాలం పనిచేయదన్న నిజాన్ని ఈ ఘటనలు చెబుతున్నాయి.

## ప్రజా కవి కాళోజీ సేవలు అభినందనీయం




### నగర మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ మహా;** ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా నగర మేయర్ గుండు సుధారాణి హాజరై ఆ మహనీయుని చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సమావేశం లో మేయర్ మాట్లాడుతూ కాళోజీ కళారంగానికి అందించిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, అకౌంట్స్ అధికారి శివ లింగం, ఇంచార్జి ఎస్ ఈ మహేందర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్ , డి పి ఆర్ ఓ ఎండి అయూబ్, జే ఏ ఓ సరిత, తదితరులు పాల్గొన్నారు.

## మట్టెవాడ ఠాణాను సందర్శించిన సిపి



**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు అధికారులు మొక్క ను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందు స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పనితీరుతో పాటు, పోలీస్ స్టేషన్ లో అత్యధికంగా నమోదు అయిన కేసులు, స్టేషన్ పరిధిలోని కాలనీ ల వివరాలను పోలీస్ కమిషనర్ ఇన్స్ స్పెక్టర్ కరుణాకర్ రావు ను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏ ఎస్పీ శుభం ప్రకాష్, ఉన్నారు.

## నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తిపై పీడీ యాక్ట్

### రూ.63.62 లక్షల నకిలీ సొత్తు స్వాధీనం




**వరంగల్ మహా;** నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన వ్యక్తి పై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాలు, పురుగు మందుల తో పాటు కాలం తీరిన పురుగు మందులను విక్రయించిన మెహదీపట్నం ప్రాంతానికి చెందిన ముద్దంగుల ఆదిత్య పై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను పరకాల ఇన్స్ స్పెక్టర్ క్రాంతి కుమార్ నిందితుడికి పరకాల జైలు కు అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీ యాక్ట్ అందుకున్న నిందితుడు మరో ఆరుగురు నిందితుల తో కలసి ఒక ముఠాగా ఏర్పడి.. కాలం తీరిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుండి తక్కువ డబ్బుకు కొనుగోలు చేయడం తో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందులను రైతులకు విక్రయిస్తూ పరకాల పోలీసులకు గత జూన్ 6 తారీఖున పట్టుబడిన నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 63లక్షల622 వేల రూపాయల విలువ గల నకిలీ విత్తనాలు, పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడుపై గతం లోను నిందితుడిపై మట్టెవాడ పోలీస్ స్టేషన్ మూడు కేసులు, పరకాల పోలీస్ స్టేషన్ లో ఒక కేసు నమోదు కాబడ్డాయి. ఎవరైనా రైతన్నలను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే వారి పై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## బెడిసి కొట్టిన కిడ్నాప్ ప్లాన్

### పోలీసుల అదుపులో నిందితులు, కేసు నమోదు



**వరంగల్ మహా;** జల్సాలకు, బెట్టింగ్ లకు అలవాటు పడి చేసిన అప్పులు తీర్చలేక తల్లిదండ్రులను బెదిరించే ప్రక్రియలో భాగంగా కిడ్నాప్ నాటకమాడి పైసలు వసూలుకు తెరలేపు దామనకొన్న అదిత్ సోని అను ప్రబుద్ధుడు అతని స్నేహితుడి ప్లాన్ కాస్త బెడిసి కొట్టి కేసుల పాలయ్యారు. ఈ కిడ్నాప్ ప్లాన్ ప్రచార మాధ్యమాలలో చక్కర్లు కొట్టి చివరకు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. కాగా వరంగల్ నగరంలో ఈ కిడ్నాప్ కొంత కలకలం రేపింది. వివరాల్లోకెళ్తే.. వరంగల్ మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్న అదిత్ సోని (31 సంవత్సరాలు, వ్యాపారి), వాసవీ కాలనీకి చెందిన మొహమ్మద్ యాకుబ్ పాషా (35 సంవత్సరాలు, ఆటో డ్రైవర్), పోచమ్మ మైదాన్, వరంగల్ ఇద్దరూ కిడ్నాప్ నాటకం పన్నుకుని, నిందితుడు అదిత్ సోని కుటుంబ సభ్యుల నుండి డబ్బులు వసూలు చేయాలని కుట్ర పన్నారు. తన స్నేహితుడు మొహమ్మద్ యాకుబ్ పాషాతో కలిసి, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి 10 లక్షలు ఇవ్వకపోతే చంపిస్తాం అని బెదిరించారు. ఇద్దరూ ఒక లాడ్జీ గదిలో ఉండి ఫోన్ కాల్స్ చేస్తూ కిడ్నాప్ నాటకం ఆడారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సమాచారం అందుకున్న మట్వాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు కేసు నమోదు చేసి తక్షణమే దర్యాప్తు చేపట్టి మంగళవారం మధ్యాహ్నం హంటర్ రోడ్ లోని బొంది వాగు దగ్గర నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి

1. ఆటో TS24T3210
2. రెండు మొబైల్ ఫోన్లు (iPhone, Vivo)
3. నలుపు రంగు స్కార్ఫ్
4. నైలాన్ తాడు స్వాదీనం చేసుకుని

నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు పరంగా నిందితుల పై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇలాంటి మోసపూరిత కిడ్నాప్, బెట్టింగ్ కార్యకలాపాలలో పాల్గొనకూడదని హెచ్చరిస్తూ, ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా కాళోజీ జయంతి

### కాళోజీ విగ్రహానికి పూలమాల వేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా ;** ప్రముఖ కవి, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కాళోజీ జంక్షన్ లోని కాళోజీ నారాయణరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాళోజీ జయంతి ఉత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు అక్కడికి వచ్చిన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. అదేవిధంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కాళోజీ జయంతి ఉత్సవాన్ని అధికారులు సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్ కుమార్, ఇతర అధికారులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు





**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆప్తులను కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాలకు , అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. ఆదిలాబాద్ పట్టంలోని ఓల్డ్ హౌజింగ్ బోర్డ్ కు చెందిన నానాజీ బెదోడ్కర్ గుండె పోటుతో మరణించడంతో ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు.విద్యానగర్ కాలనీకి చెందిన బద్దం రమ అనారోగ్యతో మృతి చెందడంతో ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి దగ్గరి బంధువు భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన గోపిడి నాగారెడ్డి సతీమణి గోపిడి అనిత ఇటీవల మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి నాగారెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, సామ రూపేష్ రెడ్డి,మల్లన్న యాదవ్, తమ్మల చందు , దేరా కృష్ణారెడ్డి, నరేష్ రెడ్డి, అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కన్నాల ఎర్రకుంట చెరువు కబ్జాపై అధికారుల పరిశీలన



**బెల్లంపల్లి,మహా:** కన్నాల గ్రామపంచాయతీ లోని ఎర్రకుంట చెరువు కబ్జాకు గురైందనీ రైతు కార్మిక సంఘాల ఐక్య వేదిక, మరియు గ్రామస్తుల ఫిర్యాదు చేయగా జిల్లాకలెక్టర్ ఆదేశాలతోబెల్లంపల్లి తహసిల్దార్ ఎల్ కృష్ణ తోపాటు ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో మంగళవారం నాడు పరిశీలించారు.ఎర్రకుంట చెరువుకు గండి కొట్టి, ఆక్రమణకు సంబంధించి 4 దఫాలుగా సర్వే నిర్వహించారు.చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్లు కలిపి 14 ఎకరాల భూమి ఎర్ర కుంట చెరువు విస్తరించి ఉందని.మరియు ఎఫ్ టి ఎల్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పోల్స్ ను పాతి కబ్జా చేసేందుకు చేసిన ప్రయత్నాలను పరిశీలించిన అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించి త్వరలోనే వాటిని తొలగిస్తాని స్పష్టం చేశారు. చెరువుకు సంబంధించిన బఫర్ జోన్ లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని పేర్కొన్నారు. చెరువు గండి కొట్టిన విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు చెరువులోని నీరు బయటకు వెళ్లకుండా ఉండేలా ఇసుక బస్తాలతో తాత్కాలిక గండి పూడ్చివేత పనులు చేపడతామని ఇరిగేషన్ అధికారులుతెలిపారు. చెరువుకు సంబంధించిన స్థలంలో ఉన్న అక్రమణలను వెంటనే తొలగించాలని తహసిల్దారు ఆదేశించారు.రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో నివేదికను జిల్లా పాలన అధికారికి, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ కి పంపిస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు టి.మని రామ్ సింగ్, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు, చాంద్ పాషా. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు,అంబాల మహేందర్,ఓ పి డి ఆర్ జిల్లా కన్వీనర్ గోగర్ల.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా సాయి భోజన్

గర్భిణులకు బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం

బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో కార్యక్రమం

బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ



**బెల్లంపల్లి, మహా:** కాళోజి నారాయణ రావు జయంతి సందర్భంగా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో గర్భిణులకు బాలింతలకు,డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలి పారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు,బాలింతలు, రోగులు,అన్నార్తులు,ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

**మహనీయుల స్మరణలో భోజనం**

కాళోజీ నారాయణరావు వంటి తెలం గాణ మహనీయుల స్మరణలో సాయి భోజన్ పెట్టడం ఆనందంగా ఉందని బాయిజమ్మ సాయిసేవా ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి తెలిపారు.తెలంగాణ ప్రాంతంకోసం, తెలంగాణ భాష.. యాసల కోసం తన కవితల ద్వారా ఉద్యమించిన మహోన్నత వ్యక్తి కాళోజి నారాయణరావు అని కొనియాడారు...అన్నదానం చేద్దాం..ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ సూచించారు ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్,సభ్యులు, జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతురాజుల తిరుపతి ఆరెల్లి కుమార్,రాయిశీడం శ్యామ్ రావు దాతలు, తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా ఎలక్ట్రానిక్ జిల్లా అధ్యక్షుడిగా కందుల శ్రీధర్

**వరంగల్ మహా;** టీయూడబ్లుజే, ఐజేయూ వరంగల్ జిల్లా కమిటీ నిర్ణయం మేరకు వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ జిల్లా అధ్యక్షుడిగా కందుల శ్రీధర్ మంగళవారం ఎన్నికైనారు. ఈ సందర్భంగా జిల్లా కమిటి తో కలిసి హైదరాబాద్ లోని ఐజేయూ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించగా నూతన అధ్యక్షుడు కందుల శ్రీధర్ కు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, తదితరులు ఉన్నారు




### ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీపీ

**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్కు చేరుకున్న కమిషనర్ కు స్టేషన్ సిబ్బంది మొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్రత, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధి నిర్వహణపై సమీక్ష జరిపారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, కేసుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో నమోదైన ముఖ్యమైన కేసులు, స్థానిక కాలనీల పరిస్థితులు, రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీల జాబితా తదితర అంశాలపై ఇన్స్పెక్టర్ షుకూర్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సీపీ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలతో మరింత సమన్వయంతో వ్యవహరించి, సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సీపీతో పాటు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏఎస్పీ , శుభమ్ ప్రకాష్, తదితరులు, పాల్గొన్నారు.

## ప్రజాకవి కాళోజి నారాయణరావుకు ఘన నివాళులు

### సాదాసీదా జీవనం గడిపిన మహనీయుడు కాళోజి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** ప్రజాకవి పద్మవిభూషన్ కాళోజీ నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టుక నీది, చావు నీది దేశం కోసం బ్రతుకు అని తెలంగాణ ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో తన కలం ద్వారా కోట్ల మందిని ఐక్యం చేసిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమర యోధుడు, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కాళోజీ అని, ఆయన కవిత్వం కేవలం సాహిత్యమే కాకుండా సామాజిక మార్పుకు మార్గం చూపిన శక్తివంతమైన ఆయుధమని అన్నారు. పేదల వేదన, ప్రజల ఆశలు, సామాజిక అన్యాయాలను ప్రతిబింబించేలా ఆయన రచనలు నేటికీ తరతరాలకు ప్రేరణనిస్తు న్నాయని వారు గుర్తుచేశారు. స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించి, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజాకవి కాళోజీ అని వారు అన్నారు. సాదాసీదా జీవనం గడిపి, తన ఆలోచనలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడని అన్నారు. కాళోజీ కలలు, ఆకాంక్షలు సాకారం చేసే దిశగా మనమందరం ముందుకు సాగాలని కలెక్టర్ కోరారు.

## ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### విద్యార్థులకు మెరుగైన బోధన, మంచి భోజనం అందించాలి



**వరంగల్ మహా;** వరంగల్ ఆటోనగర్ లోని గిర్మాజీపేట ప్రభుత్వ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షయ పాత్ర వారిచే వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు రుచి గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థుల తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, పాఠాలు బోధించి, పాఠ్యాంశాల పై ప్రశ్నలు అడిగి, వారి విషయావగహన పరీక్షించారు. మెరుగైన బోధన అందించుటకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే.. జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. ముఖ్యంగా మెరుగైన విద్య బోధించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ ఇక్బాల్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు భోపాల్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## పండ్లు, కూరగాయల సాగులో జిల్లా రైతులను ప్రోత్సహించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లాలో పండ్లు, కూరగాయల సాగులో జిల్లా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలలతో జిల్లాలో పండ్లు, కూరగాయల సాగు, వాటి అమ్మకాలు, ఇతర ప్రాంతాల నుండి ఎంతెంత వస్తుంది, పట్టు పరిశ్రమ, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు అవుతుందని, చాలామంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపిస్తున్నారని అన్నారు. ఫ్రూట్స్, వెజిటబుల్స్ కు ఎప్పుడు కూడా మంచి మార్కెట్ ఉంటుందని, ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోకుండా జిల్లా లోనే ఫ్రూట్స్, వెజిటబుల్స్ సాగు అయ్యే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మహిళా సమాఖ్య ద్వారా కందులు కొనుగోలు చేసిన అనంతరం ప్రాసెస్ చేసిన తరువాత పప్పు అమ్మకాలు సాగించాలన్నారు. మహిళా సమాఖ్య, మహిళా ఎఫ్ పీ వోలకు మార్గనిర్దేశం చేస్తూ లాభాలు పొందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డివో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి అనసూయ, మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఇతర అధికారులతో పాటు ఐనవోలు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్ల పక్కన దేవత మూర్తుల విగ్రహాల అమ్మకాలు నిషిద్ధం

### బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలో రోడ్ల పక్కన దేవత మూర్తుల విగ్రహాల అమ్మకాలు నిషిద్ధం అని బల్దియా అదనపు కమిషనర్ చంద్రశేఖర్ నేడొక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు బల్దియా పరిధి లో రోడ్ల పక్కన దేవత మూర్తుల విగ్రహాలు అమ్మడం నిషేధం అని ఇందువల్ల ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని దీని పై ఫిర్యాదులు కూడా అందాయని ప్రజలు వాహన దారులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని దృష్టిలో పెట్టుకొని బల్దియా పరిధి వరంగల్ నగరానికి సంబంధించి ఉర్సు రంగలీల మైదానం, హన్మకొండ పరిధి లో హయగ్రీవ చారి గ్రౌండ్(కాళోజీ కళాక్షేత్రం ప్రక్క మైదానం) ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుకోవాలని, విగ్రహాలు విక్రయించే వ్యాపారస్థులు ఖచ్చితం గా ఆయా ప్రాంతాల్లో మాత్రమే అమ్మకాలు జరపాలని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రచార మాధ్యమాలలో తప్పుడు ప్రచారాలు చేయవద్దని, క్షేత్ర స్థాయి లో అధికారులు తనిఖీలు నిర్వహిస్తారని, నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పక్కన విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని, కావున విగ్రహ విక్రయదారులు సూచించిన ప్రాంతాల్లో విగ్రహాల అమ్మకాలు జరుపుకుంటూ ప్రజలందరి శ్రేయస్సు దృష్ట్యా బల్దియాకు సహకరించాలని ఆయన కోరారు.

# చెరువుల, నాళాలను వదలని కార్పొరేట్ సంస్థలు, బిల్డర్లు

## నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన, పట్టించుకోని అధికారులు.. బీఆర్ఎస్ నాయకులు



**రాజేంద్రనగర్, మహా ;** మణికొండ మునిసిపాలిటీ పరిధిలోని ముష్కం చెరువు పరిసర ప్రాంతాలలో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాసమస్యలపై ప్రజా సేకరణ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గొలుసు కట్టు చెరువులైన ముష్కిం చెరువు, ఖాజాగూడా చెరువు, భగీరథ చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువు, నిక్నాంపూర్ చిన్న చెరువు, పెద్ద చెరువులతోపాటు బల్కాపూర్ నాలా, పందెంవాగు నాలాలను పూర్తి స్థాయిలో పునరుద్దించాలి. బల్కాపూర్ నాలా పలుచోట్ల అన్యాక్రాంతమైనది. ముష్కిన్ చెరువు ప్రాంతాలలో బహుళ అంతస్తు సముదాయాలు వెలుస్తున్నాయి. సహజ సిద్ధంగా పారే వర్షపు నీరు, కాజాగూడా చెరువు నుంచి ముస్కిం చెరువులోకి పారే నీటి కాలువను సహజ సిద్ధంగా పారకుండా కట్టడి చేసి కాల్వలను ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మించారు. ముష్కం చెరువులోకి మురికి నీటిని వదులుతున్నారు. డ్రైనేజీ నీరునుచెరువులోకి వదలడంతో ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. డ్రైనేజ్ నీరు చెరువుల్లోకి వదిలి భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నారు. టవర్లును నిర్మిస్తున్న కార్పొరేట్ సంస్థలు బిల్డర్లు మణికొండ ప్రాంతంలోని పలు చెరువులను నాళాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే పరిస్థితి లేదు. ముష్కిన్ చెరువును కాపాడడంలో హెచ్ఎండిఏ , హైడ్రా మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. కంచే చేను మేసినట్టుగా చెరువులు కాపాడాల్సిన అధికారులు కార్పొరేట్ సంస్థలకు నిర్మాణదార్లకు సహకరిస్తున్నారు. ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి మణికొండ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, బిఆర్ఎస్ నాయకులు ధనరాజ్, నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, లక్ష్మణ్ రావు, శ్రీకాంత్, కిరణ్ యాలాల, గోరుకంటి విఠల్, బొడ్డు శ్రీధర్, మొహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, బాబు రావు, మహేందర్, తిరుపతి, దేవి తదితరులు డిమాండ్ చేశారు.

## ఎస్సి, ఎస్టి కేసు ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### తెలంగాణ రాష్ట్ర ఎస్సి,ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్



**బెల్లంపల్లి, మహా:** మంచిర్యాల జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసు ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా జిల్లాగా అధికార యంత్రాంగం దృష్టిసారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం రోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్,తెలంగాణ రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్,మంచిర్యాల డిసిపీ భాస్కర్ ల ఆధ్వర్యంలో ఎస్సి,ఎస్టీఅట్రాసిటీ,విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఎక్స్ గ్రేషియాను త్వరగా ఇప్పించాలని అలాగే ఎస్సి,ఎస్టి కేసు ఫిర్యాదులను ఎలాంటి జాప్యం చేయకుండా కేస్ రిజిస్టర్ చేయాలని,అట్రాసిటీ కేసులలో త్వరగా ఇన్వెస్టిగేషన్ చేయాలనీ,హత్య కాబడిన కుటుంబాలకు,హత్యాచార బాధితులకు డబుల్ బెడ్ రూమ్స్ ఇండ్లను మంజూరు చేయాలని,కుల ధ్రువీకరణ పత్రాలను ఆలస్యం చేయకుండా త్వరగా మంజూరు చేయాలనీ తాసిల్దార్ లకు కలెక్టర్ ఆదేశాలుఇవ్వాలని ఎస్సి,ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్ తెలిపారు.ఈ సమావేశంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ , డి ఎస్ డి ఓ దుర్గప్రసాద్,ఎస్సి,ఎస్టీ కోర్ట్ పిపి రమణారెడ్డి, వయోజన అధికారి పురుషోత్తం నాయక్,మంచిర్యాల,బెల్లంపల్లి ఏసీపీ లు ప్రకాష్ ,రవికుమార్,సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు, డీవీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు నిర్మల్ జిల్లాలో ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి పర్యటన

**ఆదిలాబాద్ మహా :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. నిర్మల్ గ్రామీణ మండలం కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పలు కార్యక్రమాలకు ఆయన హాజరు కానున్నారు. ఉదయం 10గంటలకు నిర్మల్ చేరుకుంటారు.10 నుండి 12 వరకు బాసరలో మధ్యాహ్నం 12నుండి 130 వరకు బాసర ఆర్జే యూకేటీలో పర్యటిస్తారు. 2గంటలకు సోన్ నుండి ధర్మారం వరకు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తారు.అనంతరం సోన్ జడ్పీహైస్కూల్ లోని ఆస్ట్రో ల్యాబ్ ను సందర్శిస్తారు. 3 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. 330 కు కొండాపూర్ లో ఫంక్షన్ హాల్ లో పలు సంక్షేమపథకాల లబ్ధిదారులతో సమావేశం,అనంతరం సాయంత్రం 430నుండి 630 వరకు నిర్మల్ ఐడీవోసీ లో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారు. రాత్రి నిర్మల్ లో బస చేసి గురువారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజక వర్గంలో పర్యటిస్తారు.

## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో

# అభివృద్ధి పనులు



- ఆరుట్లలోని బీరప్ప గుడి వద్దకు సీసీరోడ్డు
- బలహీన వర్గాల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి
- మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆరుట్లలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో, గ్రామంలోని బీరప్ప గుడి వద్దకు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలోని బీరప్ప స్వామి గుడి వద్దకు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ.10 లక్షల నిధులతో సిసిరోడ్డు పనులను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల పిఎసిఎస్ చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని, ఆరుట్ల గ్రామ కుర్మ సంఘం సభ్యులు ఎమ్మెల్యేని కలిసి, బీరప్ప గుడి వరకు సిసిరోడ్డు వేయించాలని కోరగానే, ఎమ్మెల్యే రంగారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యేక చొరవ చూపి 10 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారని అన్నారు. బలహీన వర్గాల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఈకార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసి డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, ఆరుట్ల మాజీ సర్పంచ్ లు అనంగల్ల యాదయ్య, సుంకరి పాండరీనాథ్, మాజీ ఎంపీటీసీలు కావలి శ్రీనివాస్, లాలగారి శ్రీకాంత్, వెంకటేశ్వర రెడ్డి, చెరుకు నరసింహగౌడ్, మార బౌరమ్మ లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, బుట్టికృష్ణ, రావుల భాషయ్య దాసరమోని రమేష్, కావలి బుగ్గరాములు, గౌడ్ మార సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారులతో కలెక్టర్ గూగుల్ మీట్

**ఆదిలాబాద్ మహా :** ఎండోమెంట్ భూములు, భూ భారతిలో నమోదైన సాదాబైనామాలు , అసైన్డ్ ల్యాండ్ దరఖాస్తుల పై గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం తన క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వివిధ మండలాల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, భూ పరమైన వివాదాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యు సదస్సులో వచ్చిన సాదాబైనామా, అసైన్డ్ లాండ్ కు సంబంధించిన దరఖాస్తులు ఎన్ని, అందులో ఎన్ని నోటీసులు జనరేట్ చేసి సర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి, పెండింగ్ కి గల కారణాలను కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు.ఎక్కువ పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు .ఆర్డీవో లాగిన్ లో ఉన్న విరాసిత్, మిస్సింగ్ సర్వే నెంబర్లు, పేరు, సర్ నేమ్ ,తదితర పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, భూ రికార్డులను ప్రామాణికంగా రూపొందించాలని,అదే విధంగా భూ భారతి అప్లికేషన్‌లో నమోదవుతున్న సాదా బైనామాలు, వాటి పరిశీలన, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రొహిబిషన్ & ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 11న జిల్లాకు రానున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు, ముఖ్యంగా భోరజ్ మండలం పిప్పర్ వాద లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన సందర్భంగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు .బోథ్, ఇంద్రవెల్లి, అదిలాబాద్ రూరల్ లో పలు కార్యక్రమాలను ప్రారంభించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రివ్యూ మీటింగ్ కి హాజరవుతారని , అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు.ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యు విభాగం అధికారులు పాల్గొన్నారు.

# తెలుగుదేశంలో చేరికలు



**మందమర్రి, మహా :** మందమర్రి మునిసిపాలిటీ 15 వ వార్డుకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 70 మంది మహిళలు టిడిపి మహిళా పట్టణ అధ్యక్షురాలు జూపాక సంధ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు వాసాల సంపత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీనీ వీడి స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలో చేరడపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు కోట్ల ప్రజలను వంచించి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చి ఆ కుటుంబం అంతా దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు అమరులలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. మహిళలకు 2500 రూపాయలు, పేదింటి మహిళ వివాహానికి తులం బంగారం, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ పెంపు, విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని ఇలా ఎన్నో మోసపూరితమైన మాటలు చెప్పి వాటి ఎవరి పరచడంలో పూర్తిగా విఫలమైందని వాక్యానించారు. ఇక రానున్నది నార చంద్రబాబు నాయుడు ప్రభుత్వమేనని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కారం రాజు, గౌరవ అధ్యక్షురాలు ఆర్కే జయ,సామ నాగేష్, పారుపల్లి శీను, సత్యనారాయణ, లక్ష్మణ్, సామ కవిత, జ్యోతి తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

## అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా పరిధిలో ఎవరైనా అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో డి.సి.పి. ఎ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ లతో కలిసి తహశీల్దార్లు, పోలీసు శాఖ అధికారులు, అటవీ రేంజ్ అధికారులతో అటవీ భూముల ఆక్రమణల నిరోధంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆక్రమణల నిరోధానికి పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. అయినా అటవీ చట్టాలను ఉల్లంఘించి అటవీ భూముల ఆక్రమణ పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో ఆక్రమణ గురైన అటవీ భూమిలను గుర్తించి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, సి.ఐ.లు, జన్నారం తహశిల్దార్ రాజ మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధులను అడ్డుకున్న వారిపై కేసు నమోదు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి కలెక్టర్ సిసి బొడ్డు రాయలింగు విధులకు ఆటంకం కలిగించిన చెన్నూరి సమ్మయ్య , జిలకర శంకర్ , జీడి సారంగం , లింగంపెల్లి శ్రీనివాస్ , మంతెన మల్లేష్, గడ్డాల బనయ్య ఇతరులపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సిఐ ఏ అశోక్ తెలిపారు. సెప్టెంబర్ 8 నాడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ సిసి బొడ్డు రాయలింగు తన విధుల్లో ఉండగా కొంతమంది ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చినట్లు సిఐ తెలిపారు. దానితో కలెక్టర్ అందుబాటులో లేడని చెప్పినా కూడా వినకుండా వాగ్వివాదానికి దిగి కలెక్టర్ ఛాంబర్ లోకి అక్రమంగా ప్రవేశించినట్లు చెప్పారు. దాంతో రాయలింగు ఇచ్చిన ఫిర్యాదును అందుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




**ఆమనగల్లు, మహా:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో నేడు ఆమనగల్లు పట్టణ కేంద్రంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని క్లబ్బు అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి పిఆర్వో పాషా తెలిపారు. ఆమనగల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నము రెండు గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాధవరెడ్డి, మండల విద్యాధికారి పాండు, రీజియన్ చైర్ పర్సన్ జనార్ధన్ రెడ్డి, లయన్ చెన్నకేశవరెడ్డి, జోన్ చైర్ పర్సన్ లింగయ్య, సెక్రటరీ శ్రీనివాసు,కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరవుతారని, ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.



## రావిచేడ్ లో యూరియా కోసం రైతుల పడిగాపులు

### రైతులకు సరిపడా యూరియా అందించాలి- రైతులు

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వం స్పందించి, రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కడ్తాల్ మండలం, రావిచేడ్ గ్రామంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలకు ఈ సమయంలో యూరియా చాలా అవసరం. పంటలు కీలక దశలో ఉన్నందున యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగ్రో రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. పెద్ద ఎత్తున లైన్లలో నిలబడ్డారు. ఒక్క బస్తా యూరియా కోసం రైతులు రోజంతా పడిగాపులు కాశారు. కేవలం 220 బస్తాలు మాత్రమే సరఫరా కావడంతో, ఎవరికి దొరుకుతుందో, ఎవరికి దొరకదోనని రైతులు ఆందోళన చెందారు. ప్రభుత్వం స్పందించి, రైతులకు సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.

## యూరియా కోసం రైతుల బారులు



**ఆమనగల్లు, మహా:** బస్తా యూరియా కోసం మండుటెండలో అన్నదాతలు నరకయాతనఅనుభవించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆధార్, భూమి పాసుపుస్తకం, 1బీ జెరాక్స్ కాపీలను కేంద్రం వద్ద లైన్‌లో పెట్టారు. ఎండ మండుతున్నా క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలకు ఈ సమయంలో యూరియా చాలా అవసరం. పంటలు కీలక దశలో ఉన్నందున యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగ్రో రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. పెద్ద ఎత్తున లైన్లలో నిలబడ్డారు.ఒక్క బస్తా యూరియా కోసం రైతులు రోజంతా పడిగాపులు కాశారు. ఎవరికి దొరుకుతుందో, ఎవరికి దొరకదోనని రైతులు ఆందోళన చెందారు. యూరియా అందరికీ అందకపోవడంతో రైతులు మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి, అవసరమైన యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.



## ఈవీఎం గోడౌన్ల త్రైమాసిక తనిఖీలు

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఈవీఎం గోడౌన్లను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లాలోని రాజేందర్ నగర్ ఈవీఎం గోడౌన్లను, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని, గదులను అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భాంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో గోదాముల సీల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించడం జరిగింది. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సరిపడా యూరియాను అందించి

# రైతులను ఆదుకోండి

### లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి



**ఆమనగల్లు, మహా:** రైతులకు సరైన సమయంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారిని ఉష కలిసి ను యూరియా అందక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి, మాడ్గుల్ మండలాలలో రైతులకు సరిపడా యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తద్వారా పంటలను నష్టపోయే పరిస్థితులు తలెత్తుతాయని, వెంటనే రైతులకు వీలైనంత తొందరగా యూరియా అందజేయాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పనులను, పాడి పశువులను వదిలి యూరియా సెంటర్ల దగ్గర రోజుల తరబడి యూరియా కోసం ఎదురు చూస్తున్నప్పటికిని, రైతులకు మేలు జరిగే చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని అన్నారు. రైతులకు సరైన సమయంలో యూరియా అందకపోవడంతో పంట దిగుబడి రాదని, తద్వారా వ్యవసాయ పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు ఉండవని స్పష్టం చేశారు. రైతులు రోజు మొత్తం యూరియా సెంటర్ల దగ్గర పడిగాపులు కాస్తే ఒకటి, రెండు యూరియా బస్తాలు మాత్రమే దొరకడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.ఈ విషయంలో రైతులకు సరిపడా యూరియాను వెంటనే అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తమాదారం మాజీ సర్పంచ్ సాయిలు, కడ్తాల్ బీసీ మండల అధ్యక్షులు పిప్పళ్ళ వెంకటేష్, గూద పర్వత్ కుమార్ యాదవ్,జంబుల అభిషేక్ రెడ్డి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బుర్ర నర్సయ్య గౌడ్ కు శుభాకాంక్షలు

**రాజేంద్రనగర్ మహా ;** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులుగా మాజీ పార్లమెంట్ సభ్యులు బుర్ర నరసయ్య గౌడ్ ను అయిన నివసంలోకలిసినరాష్ట్రబీసీయువమోర్చానాయకులు అడికే రాజు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## స్వరాష్ట్ర సాధనలో కాళోజీ కీలక పాత్ర



**ఆమనగల్లు, మహా :** తెలంగాణ భాషకు, యాసకు పట్టంకట్టాలని నినదించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని మున్సిపల్ కమిషనర్ శంకర్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు.తెలంగాణ భాషకు అస్తిత్వం కల్పించడంలో, స్వరాష్ట్ర సాధనలో కాళోజీ కీలక పాత్ర పోషించారని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎఈ శ్రీనివాస్, టీపీఓ వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ లు ఉపేందర్ రెడ్డి, అఫ్రోజ్, రమేశ్ నాయక్ మున్సిపల్ సిబ్బంది రామకృష్ణ షర్ఫుద్దీన్,శ్రావణ్,మనీషా, వార్డు ఆఫీసర్ లు పాల్గొనారు.

## ఇబ్రహీంపట్నంలో గణనాథుడి లడ్డు రికార్డు. రూ.8.50 లక్షలు..



**రంగారెడ్డి జిల్లా మహా:** ఇబ్రహీంపట్నంలోని జూనియర్ ఫ్రెడ్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధుని, నిర్వాహకుల ఆహ్వానం మేరకు, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, నిర్వాహకులు ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వాదాలు పొందారు. ఆయన మాట్లాడుతూ... వక్రతుండ మహాకాయ గణనాధుని కటాక్షం ప్రజలపై ఉండాలని ఆయన కోరినట్లు తెలిపారు. జూనియర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని శోభయాత్రను ఆయన ప్రారంభించారు.

**ఇబ్రహీంపట్నంలో విఘ్నేశ్వరుడి లడ్డూ రికార్డు...**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలోని జూనియర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూలు వేలం పాటలో రికార్డు ధర పలికాయి. గత పది రోజులుగా నిష్ట నియమాలతో పూజలు అందుకున్న లంబోదరుని లడ్డును, రూ.8.50 లక్షలకు ఆదిభట్ల గ్రామానికి చెందిన, మాజీ కో ఆప్షన్ సభ్యులు పల్లె గోపాల్ గౌడ్ తన సొంతం చేసుకున్నారు. అలాగే చిన్న లడ్డూ ఆకుల మహేశ్ రూ.3లక్షలకు దక్కించుకున్నారు. ఇబ్రహీంపట్నం చరిత్రలో ఇదే రికార్డు ధరని నిర్వాహకులు చెబుతున్నారు. రామాయణం, భగవద్గీతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సైకిళ్లు, ముగ్గుల పోటీలో గెలిచిన మహిళలకు పట్టుచీరలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రఖ్యాత గాయని గాయకులు భక్తి పాటలతో అక్కడికి వచ్చిన భక్తులను అలరించారు. విద్యుత్ కాంతుల నడుమ, కన్నుల పండుగగా ఈ యొక్క గణనాధుని శోభాయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఈసి శేఖర్ మామ, రాష్ట్ర యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భూపతిగళ్ళ మహిపాల్, తాళ్ల మహేష్ గౌడ్, సీఐ మహేందర్ రెడ్డి, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు, రాజకీయ నాయకులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆఫర్ చూసి క్లిక్ చేసే ముందు.. జాగ్రత్త!



పండుగ సీజన్‌లో సేల్స్ వస్తే తగ్గింపు ధరలు, ఉచిత డెలివరీ, స్పెషల్ ఆఫర్లు ఇలా ఎన్నో వస్తాయి. వీటిని చూసి ఎవ్వరైనా ఆకర్షితులవుతారు. కానీ అదే సమయంలో సైబర్ మోసాలకు ఇది మంచి అవకాశంగా మారుతుంది. ఒక తప్పుడు క్లిక్ చేసినా మీ డబ్బు, డేటా లేదా ఐడెంటిటీని కోల్పోవచ్చు. ఇప్పుడీ ఫిషింగ్ అనే మోసం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రతి నాలుగు సైబర్ దాడులలో ఒకటిగా మారింది. మన దేశంలో గత ఒక్క సంవత్సరంలోనే సైబర్ మోసాల వలన రూ.22,811 కోట్లకు పైగా నష్టం జరిగింది, కాబట్టి జాగ్రత్త! ఆఫర్ చూసి క్లిక్ చేసేముందు, అది నమ్మదగినదేనా అని ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని గ్లోబల్ కొరియర్ సంస్థ ఫెడ్ఎక్స్ సూచిస్తోంది. స్కామర్లు ఉపయోగించే ట్రిక్స్, వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసింది.

**మోసాలు ఇలా ఉంటాయి..**

పండుగ సీజన్‌లో స్కామర్లు వినియోగదారులను మోసగించడానికి కొన్ని సాధారణ ట్రిక్స్ ఉపయోగిస్తారు. ఇవి సక్సెస్ అవుతాయి కూడా ఎందుకంటే.. అవి నిజమైన వాటిగా కనిపిస్తాయి. బ్రాండ్‌ల లోగోలు, అత్యవసరంగా మాట్లాడే భాష, పరిచయమైన పేర్లు వాడుతూ మిమ్మల్ని త్వరపడేలా చేస్తారు. ఆ ట్రిక్స్ ఇవే..

- "మీ ఖాతాను వెరిఫై చేయండి" అంటూ బ్యాంక్ లేదా షాపింగ్ సైట్ పేరుతో ఫేక్ మెసేజ్‌లు పంపిస్తారు.
- కార్డ్ లేదా యూపీఐ వివరాలను దొంగిలించడానికి ఒకేలా కనిపించే వెబ్‌సైట్‌లను సృష్టిస్తారు.
- నమ్మలేని ఆఫర్లు లేదా క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నట్టు చెబుతూ ఫేక్ యాప్స్ లేదా క్యూఆర్ కోడ్‌లు ఉపయోగిస్తారు.
- తాము కొరియర్ కంపెనీల నుంచి అన్నట్టు నటిస్తూ, "మీ పార్సల్ మధ్యలో ఆగిపోయింది" అంటూ లింక్ క్లిక్ చేయమని లేదా ఒక నంబర్‌కు కాల్ చేయమని చెబుతారు.
- వెంటనే ట్రాక్ చేయండి అంటూ ఫేక్ డెలివరీ లింక్స్‌తో వాట్సాప్/ఎస్ఎంఎస్ మెసేజ్‌లు పంపుతారు.
- "డబ్బు అందుకోవడానికి" క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయమని అడిగి, మీ ఖాతాలోని డబ్బును దొంగలిస్తారు.

**స్కామ్‌ల బారినపడకుండా ఎలా జాగ్రత్త పడాలి?**

ఆన్‌లైన్ షాపింగ్ సులభమే, అలాగే సైబర్ సురక్షితంగా ఉండడం కూడా సాధ్యం. షాపింగ్ చేస్తుంటే, స్క్రోల్ చేస్తుంటే, కోడ్ స్కాన్ చేస్తుంటే ఈ సులభమైన జాగ్రత్తలు తీసుకోండి..

- తెలియని వారి దగ్గర నుండి వచ్చిన లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయకండి, నేరుగా అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌కి వెళ్లండి.
- ఎప్పుడూ వెబ్ సైట్ అడ్రస్ చూసుకోండి, నకిలీ సైట్లు చాలా సార్లు స్పెల్లింగ్ తప్పులు లేదా అదనపు పదాలు ఉంటాయి.
- ఓటిపి, పాస్‌వర్డ్స్, కార్డ్ వివరాలను ఫోన్, ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్ ద్వారా ఎవరితోనూ పంచుకోకండి
- నమ్మకమైన పేమెంట్ యాప్స్ ఉపయోగించండి, వాటిని ఎప్పుడూ అప్డేట్ చేసుకోండి
- ఒక ఆఫర్ చాలా బాగా కనిపిస్తే, వెంటనే నిర్ణయం తీసుకోవద్దు. నిజమైన అమ్మకందారులు మీపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఒత్తిడి చేయరు.

**చివరిగా..**

చాలా స్కామ్‌లు అధునాతన హ్యాకింగ్‌పై ఆధారపడవు, అవి నమ్మకంపై ఆధారపడతాయి. పండుగ రద్దీ సమయంలో, ఆ నమ్మకాన్నే స్కామర్లు దోపిడీ చేస్తారు. మీరు క్లిక్ చేసే ముందు, ప్రాథమికాలను తనిఖీ చేయడానికి కొంత సమయం కేటాయించండి, సందేశం ఎవరు పంపారు? సైట్ నిజమేనా? ఇది అసాధారణంగా అనిపిస్తుందా? అన్నవి చూసుకోండి. మీరు సైబర్ మోసానికి గురైనా లేదా అనుమానం కలిగినా వెంటనే మీ స్థానిక పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు లేదా వెబ్‌సైట్ (cybercrime.gov.in) ద్వారా సమాచారం ఇవ్వండి.

# పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఛార్జీల మోత..




పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) కొన్ని సర్వీస్ ఛార్జీలలో మార్పులను ప్రకటించింది. లాకర్ ఛార్జీలు, స్టాప్ పేమెంట్ ఇన్‌స్ట్రక్షన్ ఛార్జీలు, స్టాండింగ్ ఇన్స్ట్రక్షన్ (ఎస్ఐ) ఫెయిల్యూర్ ఛార్జీలు, నామినేషన్ ఛార్జీలకు సవరణలు వర్తిస్తాయి. కొత్త ఛార్జీలు అక్టోబర్ 1 నుండి అమల్లోకి వస్తాయి.

**లాకర్ జారీ ఛార్జీలు**

లాకర్ పరిమాణం, బ్రాంచ్ స్థానాన్ని బట్టి బ్యాంక్ లాకర్ అద్దె ఛార్జీలను పెంచింది. సవరించిన లాకర్ అద్దె తదుపరి వార్షిక అద్దె గడువు తేదీకి వర్తిస్తుంది. ప్రతిపాదిత సవరణల ప్రకారం, చిన్న లాకర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ .1,000 (పాత ఛార్జీ), సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ .1,500 (గతంలో రూ .1250), పట్టణ, మెట్రో ప్రాంతాలకు రూ .2,000 (పాత ఛార్జీ). మీడియం సైజ్ లాకర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,500 (గతంలో రూ.2,200), సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ.3,000 (గతంలో రూ.2,200), అర్బన్, మెట్రో ప్రాంతాల్లో రూ.4,000 (గతంలో రూ.3,500). పెద్ద లాకర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,000 (గతంలో రూ.2,500), సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ.5,000 (గతంలో రూ.3,000), పట్టణ ప్రాంతాలకు రూ.6,500, మెట్రో ప్రాంతాలకు రూ.7,000 (రెండూ గతంలో రూ.5,500). అతిపెద్ద (వెరీ లార్జ్) లాకర్లకు గ్రామీణ ప్రాంతాలకు రూ.6,000(పాత ఛార్జీ), సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ.7,000 (గతంలో రూ.6,000), పట్టణ ప్రాంతాలకు రూ.8,500, మెట్రో ప్రాంతాలకు రూ.9,000 (రెండూ గతంలో రూ.8,000). ఎక్స్‌ట్రా లార్జ్ లాకర్లకు గ్రామీణ ప్రాంతాలకు రూ.10,000 (పాత ఛార్జీ), సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ.10,500, పట్టణ ప్రాంతాలకు రూ.11,000, మెట్రో ప్రాంతాలకు రూ.12,000 (మొత్తం మూడూ గతంలో రూ.10,000) ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

**వన్-టైమ్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు**

లాకర్లను లీజుకు ఇచ్చే సమయంలో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ఛార్జీల విషయానికొస్తే, ప్రస్తుతం గ్రామీణ, సెమీ అర్బన్ శాఖలకు రూ .200, అర్బన్, మెట్రో శాఖలకు రూ .500 ఛార్జీలు ఉండేవి. కొత్త ఛార్జీల ప్రకారం, గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని అన్ని పరిమాణాల లాకర్లకు రూ .200, పట్టణ, మెట్రో ప్రాంతాలలో చిన్న, మీడియం లాకర్లకు రూ .500, పట్టణ, మెట్రో ప్రాంతాలలో లార్జ్, వెరీ లార్జ్, ఎక్స్‌ట్రా లార్జ్ లాకర్లకు రూ .1,000 వసూలు చేస్తుంది.

**స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఫెయిల్యూర్ ఛార్జీలు**

స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ (ఎస్ఐ) వైఫల్య ఛార్జీల కింద ప్రస్తుతం ప్రతి లావాదేవీకి రూ .100 తో పాటు రెమిటెన్స్ ఛార్జీలు, వాస్తవ పోస్టేజీని వసూలు చేస్తుండగా ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం, ప్రతి లావాదేవీకి ఛార్జ్ చేయడానికి బదులుగా, నెలకు రూ .100 ఫ్లాట్ ఫీజు, జీఎస్టీ వసూలు చేయనున్నారు. అంతేకాకుండా టర్మ్ లోన్లు (టిఎల్), రికరింగ్ డిపాజిట్లు (ఆర్డీ) మొదలైన వాటికి గరిష్టంగా మూడు ఎస్ఐ లావాదేవీలకు అవకాశం ఉంటుంది.

**నామినేషన్ ఛార్జీలు**

ప్రస్తుత నిబంధన ప్రకారం.. మొదటిసారి అకౌంట్ నామినీ నమోదు ఉచితం. ఆ తర్వాత ఒక్కో సందర్భానికి రూ.100 రుసుము వసూలు చేస్తున్నారు. ప్రతిపాదిత సవరణల ప్రకారం, మొదటిసారి అభ్యర్థన ఉచితం. ఆ తరువాత, నామినీ మరణించినప్పుడు మినహా ఒక్కో సందర్భానికి రూ .100 వసూలు చేస్తారు.

**స్టాప్ పేమెంట్ ఇన్‌స్ట్రక్షన్ ఛార్జీలు**

పీఎన్‌బీ సేవింగ్స్ ఖాతాలో స్టాప్ పేమెంట్ సూచనల కోసం ప్రస్తుత ఛార్జీలు ఒక్కో సాధనానికి రూ .100. వరుస చెక్కుల కోసం స్టాప్ పేమెంట్ అభ్యర్థించిన సందర్భాల్లో, బ్యాంకు మూడు లేదా అంతకంటే ఎక్కువ చెక్కుల పరిధికి రూ .300 ఛార్జీ విధిస్తుంది.అక్టోబర్ 1 నుండి సవరణల ప్రకారం, పొదుపు ఖాతాల కోసం స్టాప్ పేమెంట్ ఇన్‌స్ట్రక్షన్ జారీ చేయడానికి ఛార్జీలు గతంలో లాగే ఒక్కో సాధనానికి రూ .100 ఉంటాయి. అయితే, వరుస చెక్కులకు సూచనలు ఇస్తే, ఐదు లేదా అంతకంటే ఎక్కువ చెక్కుల పరిధికి రూ .500 రుసుము ఉంటుంది.

# టయోటా కార్ల ధరల తగ్గింపు.. ఫార్చ్యూనర్‌పై రూ.3.5 లక్షలు..



జీఎస్టీ తగ్గింపు, పరిహార సెస్ రద్దు వాహన కొనుగోలుదారులతో పాటు తయారీదారులకు భారీ ఉపశమనం కలిగించింది. ఇది కార్లు, ద్విచక్ర వాహనాలతో సహా అన్ని రకాల వాహనాల ధరలపైనా ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఫలితంగా, వాహన తయారీ సంస్థలు తమ అన్ని మోడళ్ల సవరించిన ధరలను ప్రకటించడం ప్రారంభించాయి. తాజాగా జపాన్ ఆటో దిగ్గజం టయోటా తమ అన్ని కార్లపై ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త జీఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చే రోజు అంటే సెప్టెంబర్ 22 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. సకాలంలో డెలివరీలు అందుకోవడానికి పండుగ సీజన్ ప్రారంభానికి ముందే వీలైనంత త్వరగా బుకింగ్‌లను కన్ఫర్మ్ చేసుకోవాలని కస్టమర్లను కోరింది. కొన్ని ప్రీమియం మోడళ్ల తగ్గింపు ధరలను కంపెనీ ప్రకటించింది. తాజా అప్ డేట్ ప్రకారం. అత్యధికంగా ఫార్చ్యూనర్ ధర రూ .3.49 లక్షల వరకు తగ్గుతుంది. దీని తరువాత మరో ప్రీమియం వేరియంట్ లెజెండర్ ధర రూ .3.34 లక్షల వరకు తగ్గనుంది. ఫార్చ్యూనర్, లెజెండర్ ధరలు వరుసగా రూ .36.05 లక్షలు, రూ .44.51 లక్షలు (రెండూ ఎక్స్‌షోరూమ్) నుండి ప్రారంభమవుతాయి. తమ లైనప్ లోని ప్రతి మోడల్ ప్రతి వేరియంట్ సవరించిన ధరలను టయోటా త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. సవరించిన జీఎస్టీ నిర్మాణం అన్ని విభాగాలలో కార్ల ధరలను తగ్గించింది. 4 మీటర్ల లోపు పరిమాణం ఉన్న చిన్న కార్లపై (1,200సీసీ వరకు పెట్రోల్ ఇంజిన్లు లేదా 1,500 సీసీ వరకు డీజిల్ ఇంజిన్లు) ఇకపై 28% బదులుగా 18% జీఎస్టీ వర్తిస్తుంది.దీంతో వీటి ధరలు 513% తగ్గుతున్నాయి.ఇక 4 మీటర్ల కంటే ఎక్కువ పరిమాణం, పెద్ద ఇంజిన్లు ఉన్న పెద్ద కార్లపై 28 శాతం జీఎస్టీకి బదులుగా 40 శాతం (ప్రత్యేక శ్లాబ్) జీఎస్టీ విధిస్తారు. అయితే సెస్ తొలగింపుతో వీటి ధరలు కూడా 310% తగ్గే అవకాశం ఉంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# సరికొత్త ఆయుధ రేసులో ప్రపంచం!

**అత్యాధునిక ఆయుధ కొనుగోళ్లపై అగ్రదేశాల దృష్టి**

దాయాదుల నిలువరింపు, సైనిక మార్కెట్ల విస్తరణే లక్ష్యం

2019 తర్వాత తొలిసారి అతిపెద్ద సైనిక కవాతు చేపట్టిన చైనా

పెంటగాన్ పేరును డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌గా మార్చిన అగ్రరాజ్యం

రక్షణ బడ్జెట్‌ను అమాంతం పెంచేసిన నాటో దేశాలు



**న్యూఢిల్లీ:** ప్రపంచంపై ఆధిపత్యం నిలుపుకొనేందుకు అగ్రదేశాలు సరికొత్త పోటీకి తెరతీశాయి. అత్యాధునిక ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడంపై దృష్టిపెట్టాయి. అత్యంత శక్తివంతమైన దేశాలైన అమెరికా, చైనా ఇప్పటికే ఈ దిశగా కసరత్తు ముమ్మరం చేయగా యూరొప్ నుంచి ఆసియా దాకా ఇతర దేశాలు సైతం తామేమీ వెనకబడలేదన్నట్లుగా రక్షణ బడ్జెట్లను అమాంతం పెంచేశాయి. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మించి ఆయుధ కొనుగోళ్ల అంశానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. దాయాది దేశాలను నిలువరించాలన్న లక్ష్యంతోపాటు కొత్త ఆయుధ మార్కెట్లను సృష్టించుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకొనేందుకు ద్విముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. దీంతో గత కొన్ని దశాబ్దాల్లోకెల్లా ఎప్పుడూ లేనంత స్థాయికి ప్రపంచ దేశాల రక్షణ బడ్జెట్లు పెరిగిపోతున్నాయి. వెరసి ప్రపంచమంతా ప్రపంచ యుద్ధాల కాలంనాటి పరిస్థితుల వైపు తిరిగి మళ్లుతోంది.

**చైనా దూకుడు..**

డ్రాగన్ దేశం చైనా 2019 తర్వాత తొలిసారి అతిపెద్ద సైనిక పరేడ్‌ను టియాన్‌మెన్ స్క్వేర్‌లో అట్టహాసంగా నిర్వహించింది. ఉక్రెయిన్ అంశంతోపాటు దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం విషయంలో అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో తన సైనిక పాటవాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంత దూరంలో ఉన్న లక్ష్యాలనైనా ఛేదించగల అత్యాధునిక ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులతోపాటు జలాంతర్గాములు, డ్రోన్లతో పరేడ్ నిర్వహించింది.

**అగ్రరాజ్యం ప్రతిస్పందన..**

చైనా సైనిక కవాతు జరిగిన రోజుల వ్యవధిలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. డ్రాగన్ దూకుడుకు ప్రతిస్పందనగా తమ దేశ రక్షణశాఖ కేంద్ర కార్యాలయమైన పెంటగాన్ పేరును తిరిగి 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'గా మార్చాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో పాత పేరును పునరుద్ధరించడమే సరైన చర్య అంటూ ఆయన చెప్పుకొచ్చారు. తద్వారా యావత్ ప్రపంచానికి తమ యుద్ధకాంక్ష, సన్నద్ధతను మరోసారి చాటిచెప్పారు. 1789 నుంచి రెండో ప్రపంచ యుద్ధం ముగిసే వరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ పేరిటే అమెరికా సైన్యం పోరాడింది.

**అదే బాటలో నాటో దేశాలు**

యూరొప్ సైతం తమ ఆయుధ సంపత్తిని పెంచుకోవడంపై దృష్టిపెట్టింది. ఈ ఏడాది రక్షణ బడ్జెట్‌ను జీడీపీలో 5 శాతానికి పెంచాలని నాటో సభ్య దేశాలు నిర్ణయించాయి. మౌలిక రక్షణ సర్వీసులు, కీలక రక్షణ వ్యవస్థల బలోపేతానికి ఈ నిధులను ఖర్చు చేయాలని తీర్మానించాయి. సభ్య దేశాలన్నీ ప్రచ్ఛన్న యుద్ధ కాలంనాటి సైనిక సన్నద్ధతను 2030 నాటికల్లా సంతరించుకోవాలని నాటో నూతన సెక్రటరీ జనరల్ మార్క్ వ్యాఖ్యానించడం ప్రస్తుత పరిణామాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

**ఇతర దేశాలూ రేసులోనే..**

ఇతర దేశాలు సైతం తామేమీ తక్కువ కాదన్నట్లుగా ఆయుధ సంపత్తి పెంచుకొనే రేసులోకి వచ్చాయి. ఉత్తర కొరియా నుంచి ముప్పు ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా.. పోలాండ్‌తో కోట్లాది డాలర్ల ఆయుధ కొనుగోళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మరోవైపు బ్రిటన్ సైతం 10 బిలియన్ డాలర్ల విలువైన యుద్ధనౌకలను నార్వేకు విక్రయించింది. అలాగే టర్కీ కూడా తమ డ్రోన్లను ప్రపంచవ్యాప్తంగా యుద్ధ జోన్ల ప్రాంతాలకు ఎగుమతి చేస్తోంది.

**సైనిక ఖర్చు అంకెల్లో..**

2.718 ట్రిలియన్ డాలర్లు: 2024లో ప్రపంచ దేశాలు చేపట్టిన సైనిక వ్యయం. ఇది భారత్, దక్షిణాఫ్రికా, కెనడా, బ్రెజిల్ దేశాల వార్షిక బడ్జెట్లకన్నా అధికం కావడం గమనార్హం. ప్రచ్ఛన్న యుద్ధకాలంనాటి స్థాయిలను సైతం ఈ వ్యయం దాటేసింది. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (ఎస్ఐపీఆర్ఐ) అంచనా ప్రకారం 2023తో పోలిస్తే 2024లో ప్రపంచ దేశాల సైనిక ఖర్చు 9.4% పెరిగింది.

**60%:** ప్రపంచ దేశాల సైనిక వ్యయంలో అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, రష్యా, చైనా, జర్మనీ వాటా.

**343 బిలియన్ డాలర్లు:** 2024లో రక్షణ రంగంపై యూరోపియన్ యూనియన్ చేసిన ఖర్చు.

**జీడీపీలో 5%:** నాటో సభ్య దేశాల నూతన రక్షణరంగ వ్యయ లక్ష్యం.

**10 బిలియన్ డాలర్లు:** నార్వేతో బ్రిటన్ కుదుర్చుకున్న యుద్ధనౌకల విక్రయ ఒప్పందం. ఇది బ్రిటన్ అతిపెద్ద ఎగుమతిగా నిలిచింది.

# క్షీణిస్తున్న అమెరికా టూరిజం: అసలైన కారణాలు ఇవే..

ప్రపంచ పర్యాటక రంగం అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. యునైటెడ్ స్టేట్స్ ఊహించని తిరోగమనాన్ని ఎదుర్కొంటోంది. అమెరికాకు వివిధ దేశాల నుంచి వచ్చేవారి సంఖ్య 8.2 శాతం తగ్గింది. ఫలితంగా పర్యటక ఆదాయం గణనీయంగా తగ్గింది. టూరిస్ట్‌లు ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, చౌకైన గమ్యస్థానాలను ఎంచుకుంటున్నారు. అమెరికాకు పర్యాటకుల సంఖ్య తగ్గడానికి కారణాలను పరిశీలిస్తే.. వీసా ఆలస్యం, పెరిగిన ఖర్చులు, రాజకీయ ప్రభావం, భద్రతకు సంబంధించిన ఆందోళనలు ప్రధానంగా పర్యాటకుల సంఖ్య తగ్గడానికి కారణమని కొంతమంది విశ్లేషకులు చెబుతున్నారు. యూఎస్‌కు వెళ్లే జర్మన్‌ల సంఖ్య 12 శాతం తగ్గింది. వీరంతా పోర్చుగల్, కెనడా, వియత్నాం దేశాలను సందర్శిస్తున్నారు. జపనీస్ సందర్శకుల సంఖ్య.. కోవిడ్ మహమ్మారి సమయం నుంచే 35 శాతం తగ్గిపోయింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో వీరందరూ.. దక్షిణ కొరియా, థాయిలాండ్, ఆస్ట్రేలియాలను సందర్శిస్తున్నారు. అంతే కాకుండా అమెరికాకు వెళ్లే కెనడా పర్యాటకుల సంఖ్య 20.2 శాతం పడిపోయింది. వీసా ఆలస్యం కారణంగా.. బ్రెజిల్ ప్రజలు అమెరికాకు ప్రత్యామ్నాయం వెతుక్కుని, యూరప్, సౌత్ అమెరికా దేశాలకు వెళ్తున్నారు. ఈ దేశీయులు అమెరికా వీసా కోసం 300 రోజులు నిరీక్షించాల్సి ఉంది. ఇది బ్రెజిలియన్ ప్రయాణికులను వేరే మార్గం వెతుక్కునేలా చేసింది. ఇక భారత్ విషయానికి వస్తే.. అమెరికా అధ్యక్షుడు ప్రతీకార సుంకాలను విధించడమే కాకుండా, వీసా ఆంక్షలను కూడా మరింత కఠినం చేశారు. ఇప్పుడు వీసా కోసం భారతీయులు ఏకంగా 400 రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. రూపాయి కూడా బలహీనపడటం.. అమెరికాలో ఖర్చులు పెరగడం వల్ల, ఇండియన్స్.. ఆగ్నేయాసియా, యూరప్ దేశాలను ఎంచుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య తగ్గుముఖం పట్టడంతో.. అమెరికాలోని ప్రధాన నగరాలు ఇబ్బంది పడుతున్నాయి. పర్యాటకుల సంఖ్య 17 శాతం తగ్గడంతో న్యూయార్క్ నగరం 4 బిలియన్ డాలర్ల నష్టం చూసింది. శాన్ ఫ్రాన్సిస్కో & లాస్ ఏంజిల్స్ కూడా ఇలాంటి నష్టాలనే చవిచూస్తున్నాయి. వీసా విధానాలు సడలించకపోతే.. పర్యాటక రంగంలో అమెరికా కోలుకోవడానికి మరో రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అందుకే ఎర్ర సముద్రంలో

# కేబుల్స్ కట్!?

**ప్రపంచ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తే ఘటన ఎర్ర సముద్రంలో చోటు చేసుకుంది. సౌదీ అరేబియాలోని జెడ్డా తీరానికి సమీపంలో ఉన్న అండర్‌సీ ఫైబర్-ఆప్టిక్ కేబుళ్లు ఇటీవల తెగిపోవడంతో భారత్, పాకిస్తాన్, యూఏఈ సహా ఆసియాలోని పలు దేశాల్లో ఇంటర్నెట్ సేవలు తీవ్రంగా ప్రభావితమైన సంగతి తెలిసిందే. అయితే.. ఆ కేబుల్స్ ఎందుకు తెగిపోయాయో అనేదానిపై నిపుణులు ఓ అంచనాకి వచ్చారు.**



ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. ఈ విఘాతం వాణిజ్య నౌకల రాకపోకల వల్లే జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నౌకలు సముద్రంలో యాంకర్ వదిలినప్పుడు.. అవి అడుగున ఉన్న కేబుళ్లను లాగడంతో తెగిపోయే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ కేబుల్ రక్షణ కమిటీ నివేదిక ప్రకారం.. ప్రతీ ఏటా యాంకర్ల వల్లే ప్రపంచవ్యాప్తంగా 30% కేబుల్ విఘాతాలు ఇలాగే జరుగుతున్నాయి. పైగా.. తాజాగా తెగిన కేబుల్స్ ఎర్ర సముద్రం మరియు ఆఫ్రికా-అరబ్ ద్వీపకల్పం మధ్య 'బాబ్ ఎల్ మందెబ్ స్ట్రెయిట్' అనే వ్యూహాత్మక ప్రాంతంలోనే ఉంది. అయినప్పటికీ ఇక్కడ సముద్రపు లోతు తక్కువగా ఉండడం వల్ల యాంకర్లు కేబుళ్లను తాకే అవకాశం ఎక్కువ ఉందని చెబుతున్నారు. ఇదిలా ఉంటే తాజా ఘటనలో SMW4, IMEWE, FALCON GCX, EIG వంటి కీలక కేబుళ్లు ప్రభావితమయ్యాయి. వీటి ద్వారా ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్ మధ్య డేటా ట్రాఫిక్ జరుగుతుంది. దీంతో సంబంధిత దేశాల్లో స్లో కనెక్టివిటీ, అధిక ల్యాటెన్సీ వంటి సమస్యలు తలెత్తాయి. అయితే మైక్రోసాఫ్ట్ అజూర్, ఎటిసలాట్, డీయూ ట్రాఫిక్‌ను రీరూట్ చేసి తమ సేవలను కొనసాగిస్తున్నాయి. ఇక, ఈ విఘాతం వెనుక ప్రాంతీయ రాజకీయ ఉద్రిక్తతలు (హౌతీ రెబల్స్ పనేనా?) కారణమనే అనుమానాలు మొదట వ్యక్తం అయ్యాయి. అయితే, హౌతీలు తమ ప్రమేయాన్ని ఖండించారు. యెమెన్ ప్రభుత్వం మాత్రం ఈ దాడులను డిజిటల్ మౌలిక సదుపాయాలపై ఉద్దేశపూర్వక దాడులుగా అభివర్ణించింది. "ఇప్పుడు ఎర్ర సముద్రంలో జరుగుతున్నది ప్రపంచ సమాజానికి హెచ్చరికగా ఉండాలి... ఆధునిక ప్రపంచానికి ప్రాణవాయువులాంటి డిజిటల్ మౌలిక సదుపాయాలను రక్షించాల్సిన అవసరం ఉంది" అని యెమెన్ అధికారిక సమాచార శాఖ మంత్రి మొఎమ్మర్ అల్‌ఎర్యానీ అభిప్రాయం వ్యక్తం చేశారు. కేబుళ్ల మరమ్మతులకు స్పెషలైజ్డ్ నౌకలు, సాంకేతిక నిపుణులు అవసరం. దీంతో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొన్ని వారాలు పట్టే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ డేటా సరఫరాలో సముద్ర గర్భ (Undersea/Subsea) ఫైబర్‌ఆప్టిక్ కేబుల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. దాదాపు 99%కి పైగా అంతర్జాతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్ ఈ కేబుల్స్ ద్వారానే ప్రసారం అవుతోంది. ఖండాల మధ్య డేటా ప్రసారం చేసే అత్యంత వేగవంతమైన, విశ్వసనీయమైన మార్గం. తాజా గణాంకాల ప్రకారం.. 485 కేబుల్స్ ప్రపంచ సముద్ర గర్భంలో విస్తరించి ఉన్నాయి. వీటి పొడవు 9 లక్షల మైళ్లకు పైగా ఉంటుంది. ఎర్ర సముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం, ఫసిఫిక్ మహాసముద్రం, సుయాజ్ కాలువలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. ఒక్కో కేబుల్ టెరాబిట్స్/సెకనుకు డేటా ప్రసారం చేయగలదని అంచనా. అంటే, కొన్ని సెకన్లలోనే లక్షల వీడియోలు, మెసేజులు పంపగల సామర్థ్యం. ఉపగ్రహాల కంటే ఎందుకు మెరుగైనవంటే.. బ్యాండ్‌విడ్త్ ఎక్కువ, ల్యాటెన్సీ తక్కువ. అలాగే కాస్ట్‌ఎఫెక్టివ్‌తో పాటు సురక్షితమైన డేటా మార్గంగా పేరు దక్కించుకుంది. ఉపగ్రహాలు ప్రధానంగా దూర ప్రాంతాల కోసం కాగా.. ప్రధాన డేటా మార్గం మాత్రం సముద్ర గర్భ కేబుల్స్‌గానే కొనసాగుతోంది.

### తేజ సజ్జా మిరాయ్..
### సెన్సార్ బోర్డ్ ఏ సర్టిఫికేట్
## ఇచ్చిందంటే?

హనుమాన్ మూవీతో పాన్ ఇండియా క్రేజ్ దక్కించుకున్న హీరో తేజ సజ్జా. ప్రస్తుతం యాక్షన్-ఫాంటసీ చిత్రం 'మిరాయ్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ మూవీలో టాలీవుడ్ హీరో మంచు మనోజ్ విలన్ రోల్‌లో కనిపించనున్నారు. తాజాగా మిరాయ్ సెన్సార్ బోర్డ్ సర్టిఫికేషన్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేషన్ వచ్చినట్లు హీరో తేజ సజ్జా ట్వీట్ చేశారు. పిల్లలతో కలిసి ఫ్యామిలీ ఈ మూవీని ఎంజాయ్ చేయండని పోస్ట్ చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా యాక్షన్, ఎమోషన్, భక్తి ఉండే చిత్రమని రాసుకొచ్చారు. కాగా.. ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా మెప్పించనుంది. అంతేకాకుండా శ్రియా శరణ్, జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేయనున్నారు. 2డీతో పాటు 3డీ ఫార్మాట్‌లో రిలీజవుతోంది.



## రోడ్డు ప్రమాదంలో కాజల్ అగర్వాల్

వెండితెరపై ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో మెప్పించిన కాజల్ అగర్వాల్‌కు టాలీవుడ్‌లో భారీగానే అభిమానులు ఉన్నారు. కన్నప్పలో చివరిసారిగా కనిపించిన ఆమె బాలీవుడ్ రామాయణలో నటించనుంది. అయితే, ఆమె రోడ్డు ప్రమాదానికి గురైనట్లు సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో ఆమె తన ఎక్స్ పేజీలో రియాక్ట్ అయింది. 'నేను ప్రమాదానికి గురైనట్లు కొన్ని నిరాధారమైన వార్తలను చూశాను. ఇక లేనని కూడా! కూడా ప్రచారం చేశారు. అందులో వాస్తవం లేదు. వాటిని చూసిన తర్వాత నేను ఎంతో నవ్వుకున్నాను. అంతకు మించిన ఫన్నీ న్యూస్ ఏమీ ఉండదు. పూర్తిగా అవాస్తవం ఉన్న వార్తలను వైరల్ చేయాల్సిన పనిలేదు. దేవుని దయవల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. అంతేకాకుండా మరింత బాగానే ఉన్నానని మీ అందరికీ తెలుపుతున్నాను. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మవద్దని లేదా ప్రచారం చేయవద్దని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను. ప్రేమ, కృతజ్ఞతతో మీ కాజల్' అంటూ ఆమె పోస్ట్ చేసింది. కాజల్ ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో పోరాడుతోందని సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. ఇలాంటి పుకార్లు ఎక్కడి నుండి వచ్చాయో , అవి ఎలా వ్యాప్తి చెందుతున్నాయో తెలియాల్సి ఉంది. కానీ, కాజల్ స్వయంగా సకాలంలో వివరణ ఇవ్వడం ఆమె అభిమానులకు పెద్ద ఉపశమనం కలిగించింది.




## ఆ పాత్రల మజానే వేరు

టాలీవుడ్ అగ్ర నాయిక శ్రీలీలకు బాలీవుడ్ సినిమాలపై కాన్సన్‌ట్రేషన్ ఎక్కువైంది. ఈ క్రమంలో కొన్ని తెలుగు సినిమాలను కూడా ఈ అందాలభామ రిజక్ట్ చేసిందని టాక్. ఈ విషయంపై ఇటీవల శ్రీలీల స్పందించింది. 'పాత్రల ఎంపిక విషయంలో నాకు భాషతో సంబంధంలేదు. ఇప్పటివరకూ నేను పోషించిన పాత్రల్లో ఎక్కువ శాతం పాత్రలు నా వ్యక్తిత్వానికి భిన్నంగానే ఉన్నాయి. కానీ ఈ మధ్యకాలంలో నేను విన్న బాలీవుడ్ కథలు నా వాస్తవ జీవితానికి దగ్గరగా ఉన్నాయి. వ్యక్తిగత జీవితాన్ని ప్రతిబింబించే పాత్రల్లో నటిస్తున్నప్పుడు ఆ మజా వేరుగా ఉంటుంది. అప్పుడు నటించడానికి బదులు జీవిస్తాం. బాలీవుడ్‌లో నేను విన్న కథలన్నీ దాదాపు అలాగే ఉన్నాయి.' అంటూ చెప్పకొచ్చింది శ్రీలీల. 'ఆషీకీ 3' చిత్రంతో ఈ అమ్మడు బాలీవుడ్‌లో లాంచ్ అవుతున్న విషయం తెలిసిందే.



## వీడియోలు తొలగించండి..

బాలీవుడ్ నటి ఐశ్వర్య రాయ్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన ఫోటోలను అనుమతి లేకుండా పలు వాణిజ్య ప్రకటనల కోసం ఉపయోగిస్తున్నారని వెంటనే వాటిని నిర్మూలించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో దావా వేశారు. అనుమతి లేకుండానే అనేక వెబ్‌సైట్‌లు తన పేరును ఉపయోగించి పలు వస్తువులను విక్రయిస్తున్నాయని ఆమె పేర్కొంది. AI జనరేటెడ్ ద్వారా తన పోటోలను మార్ఫింగ్ చేసి వీడియోలను కూడా ప్రసారం చేస్తున్నారని ఐశ్వర్య అన్నారు. ఐశ్వర్య రాయ్ పిటిషన్‌ను జస్టిస్ తేజస్ కరియా నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. ఐశ్వర్య తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సందీప్ సేథి కోర్టులో బలంగానే వాదించారు. ఎటువంటి అనుమతి లేకుండానే ఐశ్వర్య పేరును ఉపయోగించి పలు వస్తువులను అమ్ముతున్న అనేక వెబ్‌సైట్‌ల వివరాలను కోర్టుకు అందించారు. aishwaryaworld.com అనే ఒక వెబ్‌సైట్‌ను సూచిస్తూ.. ఆమె నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే అది "ఐశ్వర్య రాయ్‌కు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్" అని చెప్పుకుంటున్నారని సేథి అన్నారు. ఒకరి లైంగిక కోరికలను తీర్చుకోవడానికి ఆమె పేరు, ఫోటోలు ఉపయోగించబడుతున్నాయని న్యాయవాది సందీప్ సేథి కోర్టులో లేవనెత్తారు. ఒక పెద్దమనిషి ఆమె ఫోటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు సంపాదిస్తున్నాడు. ఇది చాలా నీచమైన పని అంటూ న్యాయవాది ఫైర్ అయ్యారు. దీంతో న్యాయస్థానం కూడా ఐశ్వర్యకు అనుకూలంగానే స్పందించింది. వివిధ ప్రయోజనాల కోసం ఆమె చిత్రాలను అనధికారికంగా ఉపయోగిస్తున్న వెబ్‌సైట్‌లపై ఇంజక్షన్ ఆర్డర్లు జారీ చేస్తామని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. ఐశ్వర్య రాయ్ బచ్చన్ వ్యక్తిత్వ హక్కులను ఉల్లంఘించే URL లింక్‌లను పూర్తిగా తొలగించడానికి తదుపరి ఆదేశాలు జారీ చేస్తామని జస్టిస్ తేజస్ కరియాతో కూడిన ధర్మాసనం తెలిపింది.





## ఓ ప్రాణం పోయిన రోజు..
### నువ్వు తొలిసారి ఊపిరి పీల్చుకున్నావ్!

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించినవాళ్లు మనల్ని వదిలేసి ఎక్కడికీ వెళ్లరు. ఒకవేళ తనువు చాలించి వెళ్లిపోయినా మళ్లీ ఏదో ఒక రూపంలో మనముందుకు వస్తారని చాలామంది బలంగా నమ్ముతారు. హీరోయిన్ అనస్వర రాజన్ ఇంట అదే నిజమైంది. సూపర్ శరణ్య, నెరు, రేఖా చిత్రం వంటి పలు హిట్ సినిమాల్లో నటించింది అనస్వర.

### నా పాపాయికి హ్యాపీ బర్త్‌డే

నేడు (సెప్టెంబర్ 8) ఆమె బర్త్‌డే. ఈ సందర్భంగా హీరోయిన్ తల్లి ఉషా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఓ పోస్ట్ పెట్టింది. ఆరోజు నేనెంతో ప్రేమించిన వ్యక్తిని కోల్పోయాను.. అదే రోజు నువ్వు జన్మించావు. 23 ఏళ్ల ఈ పాపాయి ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నాను. అమ్మ నీకోసం వేవేల బర్త్‌డే విషెస్ తెలియజేస్తోంది అని రాసుకొచ్చింది. ఈ పోస్ట్‌కు అనస్వర ఫోటోను జత చేసింది. దీంతో అభిమానులు హీరోయిన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

### సినిమా

కాగా ఉషా రాజన్ దంపతులకు 2002 సెప్టెంబర్ 8న అనస్వర జన్మించింది. ఈమె పుట్టడానికి ముందు ఉషా తల్లి మరణించింది. తల్లిని కోల్పోయి పుట్టెడు శోకంలో మునిగిన ఉషాకు కూతురే ప్రపంచంగా మారింది. అనస్వరలోనే తల్లిని చూసుకుని సంతోషపడిపోయింది. అనస్వర రాజన్ సినిమాల విషయానికి వస్తే.. 7/G రెయిన్‌బో కాలనీ 2 సినిమా చేస్తోంది. ఇది తెలుగులో 7/G బృందావన కాలనీ 2గా విడుదల కానుంది. దీనితో పాటు మరో రెండు మూవీస్ చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com